భీమిలి సెయింట్ ఆన్స్ స్కూల్స్ మూత?

- వార్త 6వ పేజీలో



- సిబ్బందిని అప్పగించేందుకు సిద్ధమంటూ ప్రభుత్వానికి యాజమాన్యం లేఖ
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన

అధికారులపై సీఎం అసంతృప్తి

'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకల వైఫల్యంపై ఆగ్రహం

- రెండు రోజుల క్రితం పీఎం పాలెం స్టేడియంలో కార్యక్రమం నిర్వహణ



'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకల్లో ఖాళీగా వున్న గ్యాలరీలు (ఫైల్ ఫొటో)

- స్టేడియం కెపాసిటీ 25,000
- జనం తరలింపునకు వందలాది బస్సులు ఏర్పాటుచేసినా గట్టిగా 5,000 మంది కూడా హాజరుకాని వైనం
- కార్యక్రమం సమయంలోనూ, ఆ తరువాత ఎయిర్‌పోర్టులో జిల్లా అధికారులపై ఆగ్రహం



విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):

'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకల నిర్వహణలో విఫలమయ్యారంటూ జిల్లా అధికారులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు చెబుతున్నారు. పీఎం పాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈనెల 13న రాష్ట్రస్థాయి పోటీల ముగింపు వేడుక జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా సీఎం హాజరయ్యారు. అయితే స్టేడియం సామర్థ్యం 25 వేలు కాగా కనీసం ఐదు వేల మంది కూడా రాలేదు. ఆ వచ్చిన వారిలో కూడా అత్యధికులు డ్వాక్రా మహిళలు, వలంటీర్లే. దాంతో జన సమీకరణపై అప్పుడే సీఎం తీవ్ర అసహనం వ్యక్తం చేయడం కనిపించింది.

రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించింది. దీనికోసం ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసింది. సుమారు రూ.100 కోట్లు వెచ్చించింది. ఈ పోటీలను నిర్వహించడం ద్వారా యువతను ఆకట్టుకోవచ్చునని, ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చునని వైసీపీ పెద్దలు భావించారు. కానీ పోటీల నిర్వహణకు సరైన సదుపాయాలు కల్పించకపోవడం, నిబంధనలను పాటించకపోవడం, అనుకూలమైన జట్లకు మేలు కలిగించేలా వ్యవహరించడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాంటి తరుణంలో 'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకలను ఈనెల 13న నగరంలోని పీఎం పాలెం స్టేడియంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. స్టేడియం సామర్థ్యం 27,500 కాగా, వేదిక వెనుక భాగంతోపాటు సమీపంలోని గ్యాలరీలను మినహాయిస్తే 25 వేల మందిని తీసుకురావాల్సి ఉంటుందని వైసీపీ నేతలు, అధికారులు అంచనా వేశారు. ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో నగరం నుంచి పాల్గొన్న 45 వేల మంది క్రీడాకారుల్లో నాలుగో వంతు వచ్చినా, ఇంకా విద్యార్థులు, మహిళా సంఘాలు, పార్టీ కార్యకర్తలను కలుపుకుంటే సులభంగా 25 వేల మార్కును దాటిపోతారని అధికారులు ధీమా వ్యక్తంచేశారు. జనం తరలింపు కోసం నగరవ్యాప్తంగా 585 ఆర్టీసీ బస్సులను కూడా ఏర్పాటుచేశారు. తీరా వేడుక ప్రారంభమయ్యేసరికి స్టేడియంలో కనీసం నాలుగైదు వేల మంది కూడా లేకపోవడంతో అధికారులతోపాటు పార్టీ ... మిగతా 6వ పేజీలో

19న సీఎం రాక?

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన నగరానికి రానున్నారు. చినముషిడివాడలో గల శారదా పీఠం వార్షికోత్సవంలో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు అమరావతి నుంచి సమాచారం అందడంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అయితే సీఎం పర్యటన షెడ్యూల్ వివరాలు ఇంకా అందాల్సి ఉంది.

ఉక్కుకు తప్పని కష్టాలు

అరకొరగా ఐరన్‌ఓర్ సరఫరా

మూడో వంతు మాత్రమే ఉత్పత్తి

- ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశించినా అందని ర్యాకులు
- ఇలా అయితే నష్టాల నుంచి ఎలా గట్టెక్కగలమని ప్రశ్నిస్తున్న కార్మికులు
- బయోమెట్రిక్ హాజరుపైనే మంత్రి దృష్టి
- ఉత్పత్తి పెంచేందుకు కొరవడిన సహకారం

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)



విశాఖ ఉక్కు కర్మాగారానికి ముడి పదార్థాల కొరత కొనసాగుతూనే ఉంది. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఐరన్‌ఓర్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని ఎన్ఎండీసీని ఆదేశించినా అది పూర్తిగా అమలు కావడం లేదు. దాంతో అనుకున్న స్థాయిలో ఉత్పత్తి జరగడం లేదు. జిందాల్ కంపెనీ నుంచి ఆర్థిక సాయం తీసుకొని మూడో బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్)ను కూడా వినియోగంలోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే.

ఒక్కో బ్లాస్ట్ ఫర్నేస్ ద్వారా రోజుకు సగటున ఆరు వేల టన్నుల చొప్పున మూడు బీఎఫ్‌లకు కలిపి 18 వేల టన్నుల ఉత్పత్తి రావాలి. వాస్తవిక ఉత్పత్తి అయితే మొత్తం 20 వేల టన్నులు ఉండాలి. కానీ ఐరన్‌ఓర్ అవసరమైనంత అందకపోవడం వల్ల సగటున రోజుకు 15 వేల టన్నుల కంటే తక్కువే ఉత్పత్తి జరుగుతోంది. కేంద్ర ఉక్కు శాఖా మంత్రి రోజుకు ఐరన్‌ఓర్ ర్యాకులు ఎన్ని అవసరమో చెప్పాలని కోరినప్పుడు కనీసం ఎనిమిది ర్యాకులు కావాలని యాజమాన్యం స్పష్టంచేసింది. ఒకటి, రెండు తగ్గినా ఆరుకు తక్కువ కాకుండా రోజూ ఇవ్వాలని ఎన్ఎండీసీని మంత్రి ఆదేశించారు. ఆ ప్రకారం కూడా ర్యాకులు రావడం లేదు. ఉదాహరణకు ఫిబ్రవరి నెలనే తీసుకుంటే ఈ 15 రోజుల్లో 71 ర్యాకులు వచ్చాయి. అంటే సగటున రోజుకు నాలుగున్నర ర్యాకులు మాత్రమే ఇచ్చారు. వాస్తవానికి ఆరు చొప్పున చూసుకుంటే 90 ర్యాకులు రావాలి. కానీ 19 తక్కువగా పంపించారు. దీనివల్ల ఉత్పత్తి తగ్గిపోయింది. ఫిబ్రవరి 1 నుంచి 14వ తేదీ వరకు మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 2,09,100 టన్నుల ఉత్పత్తి జరిగింది. అంటే రోజుకు సగటు ఉత్పత్తి 14,936 టన్నులు. పూర్తిగా 15 వేల టన్నులు కూడా రాలేదు. రోజువారీ లక్ష్యంలో మూడు వేల టన్నులు తక్కువగా ఉత్పత్తి జరుగుతోంది. దీనిపై ఉక్కు మంత్రి ఒక్కరోజు కూడా సమీక్షించలేదు. ఆదేశించిన ప్రకారం ర్యాకులు ఎందుకు పంపడం లేదని ఎన్ఎండీసీని ప్రశ్నించలేదు. ఇలాగైతే కష్టాలు, నష్టాల నుంచి ఎలా గట్టెక్కుతామని కార్మిక, ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

బయోమెట్రిక్ అటెండెన్స్‌పై రోజూ డ్యాష్‌బోర్డు మీటింగ్

విశాఖ ఉక్కు కోలుకోవడానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నామని చెప్పుకొంటున్న కేంద్రం ఆ దిశగా చేస్తున్నది చాలా తక్కువ. ప్లాంటును ప్రైవేటుకు అప్పగించే పనులపైనే ఎక్కువ దృష్టి పెట్టి పనిచేస్తోంది. కొద్దిరోజుల క్రితం ఉద్యోగులు, కార్మికులకు బయోమెట్రిక్ హాజరు విధానం అమలులోకి తీసుకువచ్చారు. దీనిని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. తమకు ప్లాంటు లోపల పూర్తిస్థాయి వసతులు లేవని, వాటిని ముందు కల్పించాలని, ఆ తరువాత వేతన సవరణ ఒప్పందం చేయాలని ఆ తరువాతే బయోమెట్రిక్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అంతవరకు బయోమెట్రిక్ వేయబోమని స్పష్టంచేశాయి. ఈ మేరకు ఈ నెల పదో తేదీన యాజమాన్యానికి ఓ లేఖను కూడా అందజేశాయి. అయినా సరే ఉక్కు మంత్రి రోజూ బయోమెట్రిక్ హాజరు ఎంత పెరిగిందంటూ ఉదయాన్నే మీటింగ్ పెట్టి మరీ ప్రశ్నిస్తున్నారు. దీనిని కార్మిక, అధికార వర్గాలు నిరసిస్తున్నాయి. ఐరన్ ఓర్ ర్యాకులు తగినన్ని రావడం లేదని చెబితే వాటి గురించి మాట్లాడకుండా బయోమెట్రిక్‌పైనే ఎందుకు సమీక్షిస్తున్నారంటూ ఆరా తీస్తున్నారు.

పనిచేయడం లేదని ముద్ర వేసే కుట్ర

విశాఖ ఉక్కులో కార్మికులు నిబంధనల ప్రకారం పనిచేయడం లేదని, బయోమెట్రిక్ హాజరును వ్యతిరేకిస్తున్నారని బయట ప్రపంచానికి చెప్పడానికి...తద్వారా వేతనాల్లో కోత పెట్టడానికి ప్రణాళికాబద్ధంగా ఇవన్నీ చేస్తున్నారని ప్లాంటు వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఒడిశాలో నీలాంచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌ను కూడా ఇలాగే చేసి, అక్కడి కార్మికులకు 14 నెలల వేతనాలు ఇవ్వలేదని అంటున్నారు. ఈ కుట్రలు మానేసి, తక్షణమే ప్లాంటుకు అవసరమైన ఐరన్‌ఓర్ సరఫరా చేయడంతో పాటు, ప్లాంటు లోపల అన్ని వసతులు కల్పించాలని కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. స్టీల్‌ప్లాంటు ఏర్పాటుచేసి 30 ఏళ్లు అయిందని, రాత్రిపూట ఎవరికైనా ఆకలి వేసి ఏమైనా తినాలనుకుంటనే భోజనం కూడా ఉండదని, ఇవన్నీ బయటవారికి తెలియవని, సర్దుకుపోతున్నామని కార్మికులు చెబుతున్నారు.

నా తలరాత జగనే రాస్తారు

- ఎన్నికల్లో పోటీ చేస్తేనే రాజకీయాల్లో ఉన్నట్టా?, లేకపోతే లేనట్టేనా?...
- 15 మంది అభ్యర్థులను గెలిపించే బాధ్యత నాదే
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వచ్చే ఎన్నికల్లో తన పాత్ర, బాధ్యతలు ఏమిటో చాలా స్పష్టంగా వెల్లడించారు. సిరిపురంలోని చిల్డ్రన్ ఎరీనాలో గురువారం సాయంత్రం వలంటీర్ల సన్మాన కార్యక్రమం ... మిగతా 6వ పేజీలో

రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ

- ప్రత్యేక అధికారిగా విశాఖ ఆర్డీవో నియామకం
- పెందుర్తి నుంచి సింహాచలం నార్త్ స్టేషన్ వరకూ ఫ్లైవోవర్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర శివారుల్లో నాలుగు ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ కోసం ప్రత్యేక అధికారిగా ఆర్డీవోను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. విశాఖపట్నం-గోపాలపట్నం 15.31 కి.మీ, దువ్వాడ-సింహాచలం నార్త్ క్యాబిన్ 20.543 కి.మీ, వడ్లపూడి జంక్షన్ నుంచి విశాఖ ఉక్కు కర్మాగారం, అక్కడ నుంచి గంగవరం పోర్టు వరకు 12.04 కి.మీ మేర మూడు, నాలుగు లేన్‌ల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చేయనున్నారు. ఇంకా పెందుర్తి నుంచి సింహాచలం ఉత్తర స్టేషన్ వరకు రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణం చేపడతారు. దీనివల్ల రైళ్ల రాకపోకలకు మరింత అనువుగా ఉంటుందని రైల్వే ప్రతిపాదించింది. రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం భూములు ఇవ్వడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో నాలుగు కీలక ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణకు ప్రత్యేక అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం.

ఎంవీవీ ఎక్కడ పోటీ చేసినా ఓడిస్తా

- టీడీపీ, జనసేన ప్రభుత్వం రాగానే ఆయన కబ్జాలు బయటకు తీస్తాం
- జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్

- వార్త I పేజీలో

చేజారుతున్న గ్రేటర్ ఆస్తులు

- జీవీఎంసీ 'స్టాండింగ్ కౌన్సిల్' పనితీరుపై పెదవివిరుపు
- కోర్టు కేసుల్లో సకాలంలో కౌంటర్ వేయకుండా తాత్సారం చేస్తున్నారని కొందరిపై ఆరోపణలు
- కమిషనర్ దృష్టిసారించాలనే డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) తరపున కోర్టులో వాదనలు వినిపించేందుకు కొంతమంది న్యాయమూర్తులతో మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ (ఎంఎస్‌సీ) ఉంటుంది. నగర పాలక సంస్థ వేసే కేసులతోపాటు వ్యతిరేకంగా నమోదయ్యే వాటిని స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులే చూసుకోవాలి. ఇందుకోసం ప్రతి రెండు జోన్‌లకు ఒకరు చొప్పున నలుగురు న్యాయవాదులను ఎంఎస్‌సీలుగా నియమించారు. కానీ వీరిలో కొందరి తీరు వల్ల జీవీఎంసీ విలువైన స్థలాలను కోల్పోవాల్సి వస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీకి నగరంలో అనేకచోట్ల విలువైన భూములు ఉన్నాయి. వీటిని పరిరక్షించడం జీవీఎంసీకి సవాల్‌గా మారింది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు జీవీఎంసీ భూమి/స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేసేస్తున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఎంత యత్నించినా న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జీవీఎంసీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా నగర పాలక సంస్థల్లో మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పేరుతో ప్రత్యేకంగా న్యాయవాదులను నియమించుకున్నారు. అయితే జీవీఎంసీ భూములను ఆక్రమించిన వారంతా...కొంతమంది ఎంఎస్‌సీలను ముందుగానే కలిసేవారు. తమ కేసులపై జీవీఎంసీ తరపు నుంచి సకాలంలో కౌంటర్ వేయకుండా, పక్కా ఆధారాలు లేకుండా బలహీనంగా కౌంటర్ వేసేలా మేనేజ్ చేసేవారు. దీనివల్ల జీవీఎంసీ రూ.కోట్లు విలువైన భూములను కోల్పోవాల్సి వచ్చింది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ఆరేడు నెలల కిందట పాత ఎంఎస్‌సీలను తొలగించారు. వారి స్థానంలో రెండు జోన్లకు ఒకరు చొప్పున న్యాయవాదులను నియమించుకున్నారు. అయితే వీరి నియామకం పూర్తిగా కమిషనర్ విచక్షణ ఆధారంగానే జరగాల్సి ఉన్నప్పటికీ రాజకీయ జోక్యం పెరిగిపోయింది. కొంతమంది అధికార పార్టీ నేతల కుటుంబ సభ్యులను, తమ అనుయాయుల్లో న్యాయవాదులైన వారిని ఎంఎస్‌సీలుగా తీసుకోవాలంటూ కమిషనర్, మేయర్‌పై ఒత్తిడి తెచ్చారు. దీనిపై అప్పట్లో పెద్దఎత్తున ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. అయినప్పటికీ అధికార పార్టీ నేతలు వెనక్కి తగ్గకపోవడంతో వారు అనుకున్న వారి నియామకం జరిగిపోయింది.

జీవీఎంసీకి నష్టం కలిగించేలా కొంతమంది ఎమ్మెస్సీల తీరు

జీవీఎంసీ ఆస్తులను కాపాడడమే లక్ష్యంగా పనిచేయాల్సిన ఎంఎస్‌సీల్లో కొందరు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం జీవీఎంసీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రాజేంద్రనగర్ పార్క్ విషయంలో జీవీఎంసీ రెండు కోర్టుల్లో గెలిచినప్పటికీ, ఆ పార్కును స్వాధీనం ... మిగతా 6వ పేజీలో

కొనసాగుతున్న ఉద్యోగుల నిరసన



తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆందోళన కార్యక్రమం చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలోని ఎన్జీవో హోమ్ వద్ద జరిగిన నిరసనలో ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ కె.ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి పట్టుదలకు పోయి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లను దూరం చేసుకోవద్దని హితవు పలికారు. నిరసన కార్యక్రమంలో ఏపీ జేఏసీ కన్వీనర్ ఆర్.రవిశంకర్, పింఛన్‌దార్లు, ఉపాధ్యాయ, ఆర్టీసీ, ట్రెజరీ, ఇరిగేషన్, వెటర్నరీ, పంచాయతీ, ఐసీడీఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. - విశాఖపట్నం



గుంటూరులో సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమైన అనంతరం వెళ్లిపోతున్న వలంటీర్లను అడ్డుకుని లోపలకు పంపుతున్న వార్డు సచివాలయ కార్యదర్శులు

వలంటీర్లూ వెనుతిరిగారు!

- పురస్కారాల ప్రదాన కార్యక్రమం వుడా చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు
- గుంటూరు నుంచి సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం
- వినకుండా వెళ్లిపోబోయిన వలంటీర్లు అడ్డుకుని తిరిగి లోపలకు పంపిన సచివాలయ కార్యదర్శులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగంపై వార్డు వలంటీర్లు కూడా విసిగిపోయారు. వలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న, వజ్ర పురస్కారాల ప్రదానోత్సవం రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని గురువారం గుంటూరులో నిర్వహించారు. జీవీఎంసీ పరిధిలోని వార్డు వలంటీర్లకు సేవామిత్ర, రత్న, వజ్ర పురస్కారాలను అందజేసే కార్యక్రమాన్ని సిరిపురం కూడలిలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటుచేశారు. వేదికపై మంత్రి అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ కూర్చున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం ఆరు గంటల వరకూ సాగింది. గుంటూరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేయడంతో...అందరూ శ్రద్ధగా వినాలని అధికారులు ఆదేశించారు. అయితే సీఎం ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే కొంతమంది వలంటీర్లు లేచి బయటకు వెళ్లిపోవడం ప్రారంభించారు. దీనిని వేదికపై ఉన్న మంత్రి, కలెక్టర్ గమనించారు. వలంటీర్లను బయటకు వెళ్లకుండా ఆపాలని అక్కడున్న వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. దీంతో వార్డు సచివాలయ కార్యదర్శులు పరిగెత్తుకుంటూ వెళ్లి...మెట్లు దిగి బయటకు వెళ్లిపోతున్న వారిని అడ్డుకుని తిరిగి లోపలకు పంపించారు. తర్వాత ఎవరూ వెళ్లకుండా బయట నుంచి తలుపులకు గడియపెట్టేశారు. టాయ్‌లెట్స్‌కు వెళతామన్నా సరే బయటకు పంపించకపోవడంతో చాలామంది మహిళా వలంటీర్లు ఇబ్బందిపడ్డారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన జేసీ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: వార్డు సచివాలయాల్లో పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ కె.మయూర్ అశోక్ గురువారం పరిశీలించారు. తాటిచెట్లపాలెం, నర్సింహనగర్‌లోని వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. అధికారులకు, సచివాలయ సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని రిజిస్ట్రేషన్లు చేశారు, ఎంత సమయం పడుతుందనే అంశాలపై ఆరా తీశారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కొంతమంది లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రగతి నివేదికలను పరిశీలించారు.

రహదారి నిబంధనలపై అవగాహన

కంచరపాలెం, ఫిబ్రవరి 15: రోడ్డు భద్రతా నియమాలపై కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశాఖ డీటీసీ రాజారత్నం ముఖ్యఅతిథిగా హాజరై అవగాహన కల్పించారు. వాహనచోదకులు నియమాలను విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఆర్‌సీహెచ్.శ్రీనివాస్, రఘుబాబు, శ్రీకాంత్, ఉమాశంకర్‌పాల్గొన్నారు.

డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15: డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పార్వతీపురం స్టేషన్‌లో మౌలిక సదుపాయల నిర్వహణను పరిశీలించారు. అలాగే 12 మీటర్ల వెడల్పుతో పాదచారుల వంతెన, పార్కింగ్, పరిసర ప్రాంతంతోపాటు స్టేషన్ భవనం అభివృద్ధి నిర్మాణ పనులకు సంబంధించిన ప్రణాళికలపై సమీక్షించారు. అనంతరం అక్కడకు చేరిన వివిధ సంఘాల స్థానిక ప్రతినిధుల చెప్పిన పలు సమస్యలు, సూచనలపై స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం బొబ్బిలి స్టేషన్‌కు చేరుకుని అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పాదచారుల వంతెన, వెయిటింగ్ హాల్స్, ఇతర అభివృద్ధి నిర్మాణ పనులకు సంబంధించి ప్రణాళికలను పరిశీలించారు. అక్కడ నుంచి కోరాపుట్ స్టేషన్‌కు చేరుకుని అభివృద్ధి నిర్మాణ పనులపై అధికారులతో చర్చించారు. ఈ తనిఖీలలో డీఆర్‌ఎంతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

మాధవధార, ఫిబ్రవరి 15: గ్రేటర్ 50వవార్డులో గురువారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. కీళ్ల నొప్పులు, కండరాల సమస్యల నివారణకు ఫిజియో థెరపిస్టు పి.శ్రీరామ్ శ్రీనివాస్ పరీక్షించారు. వ్యాయామాలను సూచించారు. వాకర్స్ క్లబ్ మురళీనగర్ అధ్యక్షుడు పి.చంద్రమౌళి, కార్యదర్శి పి.సెల్వరాజు పర్యవేక్షించారు.

కిటకిటలాడిన పూర్ణామార్కెట్

- రథసప్తమికి పూజా సామగ్రి కొనుగోళ్లు
- భారీగా తరలివచ్చిన నగర వాసులు
- అధిక ధరలు పలికిన పళ్లు, పూలు


కొనుగులు దారులతో రద్దీగా పూర్ణామార్కెట్


రోడ్డుపైనే విక్రయాలు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 15: కొనుగోలుదారులతో పూర్ణామార్కెట్ గురువారం సాయంత్రం కిటకిటలాడింది. రథసప్తమి పర్వదినం సందర్భంగా పూజాసామగ్రి కొనుగోలుకు భారీ సంఖ్యలో నగరవాసులు తరలివచ్చారు. దీంతో రోడ్డు మీద వ్యాపారులు పూజా సమగ్రి ధరలను అమాంతం పెంచేశారు. జిల్లేడు, అరటి ఆకు ధర చూస్తే విస్తుపోవాల్సిందే. రేగుకాయలు గ్లాసు 40 రూ..చెరకు ముక్కలు రెండు 30కి విక్రయించారు. అరటి పండ్లు ఫెడ రూ.150 కాగా, కొబ్బరికాయలు ఒకటి రూ.30కి పైగా అమ్మకాలు జరిపారు. పండగ సమయంలో పూర్ణామార్కెట్ రహదారులపై చిరువ్యాపారులు ధరలు భారీగా పెంచి విక్రయించడం ఆనవాయితీగా జరుగుతోంది. పండ్లు, పూల ధరలు మరింతగా పెరగడంతో కొనుగోలుదారులు గగ్గోలుపెట్టారు. దీనికి తోడు బుధవారంతో పోల్చి చూస్తే కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి.

ట్రాఫిక్ నియంత్రణ లోప భూయిష్టం

రహదారులు, పార్కింగ్ స్థలాలను ఆక్రమించి వ్యాపారులు సాగించే వారికి స్థానిక అధికార పార్టీ నాయకులు మద్దతుగా నిలవడంతో పూర్ణామార్కెట్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిని తొలగించేందుకు యత్నించినా వైసీపీ పెద్దలతో చీవాట్లు తినాల్సి వస్తోందని, పోలీసులు వాటిపైపు చూడడం మానేశారు.

ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికి ఇచ్చినా సహకరించాలి

- టీడీపీ ఉత్తర నియోజవర్గ నేతల సమావేశంలో నిర్ణయం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: ఉత్తర నియోజకవర్గం టీడీపీ భవిష్యత్తు కార్యాచరణపై నరసింహనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, వార్డుల అధ్యక్షులు, సెక్రటరీలు పాల్గొన్న సమావేశంలో నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బాధ్యత ఎవరు చేపట్టాలనే విషయంపై చర్చించారు. ఎవరికి బాధ్యతలు అప్పగించినా ఉమ్మడిగా సహకరించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 18వ తేదీన ఉత్తర నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో జరగబోయే శంఖారావం కార్యక్రమానికి భారీసంఖ్యలో జనాలను సమీకరించి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ, 45వ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు, 26వ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, నేతలు మేకా సత్యకిరణ్, పీపీ వసంతరావు, ఆకిరెడ్డి జగదీష్, తాతినేని శ్రీనివాసరావు, పాతురు మురళీ శేఖర్, మోర్తా రాజారావు, పుక్కళ్ళ పైడికొండ, అర్వీ రమణ, ధనాజీ, పామోటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు స్టేడియంలో పెన్ ఒలిపింక్స్


జెండా ఆవిష్కరిస్తున్న లింగేశ్వరరావు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: పోర్టు జూబ్లీ గ్రౌండ్‌లో గురువారం పెన్ ఒలింపిక్స్ పేరిట వార్షిక స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ షటిల్ ఆటగాడు బీవీఎస్‌కే లింగేశ్వరరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో పాల్గొంటే ఒలింపిక్‌కు దోహదపడతాయని చెప్పారు. స్పోర్ట్స్ మీట్‌లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఏరోబిక్స్, హూప్ డ్రిల్, రేసెస్ తదితర ఈవెంట్లలో సత్తా చాటారు. కార్యక్రమంలో అనితా పెరీరా, ఉపాధ్యాయులు, పీటీ మాస్టార్లు పాల్గొన్నారు.

బస్ బే బస్ షెల్టర్లు ప్రారంభం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: అక్కయ్యపాలెం, పోర్టు ఆస్పత్రి జంక్షన్‌లో రూ.1.7 కోట్ల వ్యయంతో నిర్మించిన బస్ బే షెల్టర్లను నెడ్‌క్యాప్ ఛైర్మన్ కేకే రాజు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బానాల శ్రీనివాసరావు, కంపా హనోక్, కె.అనిల్‌కుమార్ రాజు, ఏఈలు రమణమ్మ, ఉమామహేశ్వరరావు, పోతల కన్నప్పడు, ఇజ్జు సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి వేడుకలు

అల్లిపురం, ఫిబ్రవరి 15: స్థానిక వెంకటేశ్వరమెట్ట వద్ద గల అలమేలు మంగమ్మ దేవాలయ ప్రాంగణంలో గల ఉపాలయంలో ఉషా ఛాయాదేవి సమేత శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు జరగున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు పి.కేశవాచార్యులు తెలిపారు. స్వామి వారి జయంతిలో భాగమైన ఉత్సవంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ధర్మకర్త యల్లపు హరికృష్ణ కోరారు.

టీడీపీ ఓట్లు కాజేసేందుకు ఆడారి కుట్ర

- పార్టీ జిల్లా కార్యదర్శి పాశర్ల ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న పాశర్ల ప్రసాద్

మహారాణిపేట, ఫిబ్రవరి 15: ఆడారి తులసీరావు ఆంధ్రా కోరియన్ కాదని ఆంధ్రా అదానీ అని తెలుగు దేశం పార్టీ జిల్లా కార్యదర్శి పాశర్ల ప్రసాద్ విమర్శించారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తులసీరావు డెయిరీని అడ్డుపెట్టుకుని రూ.కోట్లు అర్జించారన్నారు. ప్రస్తుతం ఆడారి ఆనంద్ టీడీపీని ఓడించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారన్నారు. విశాఖ డెయిరీని జేబు సంస్థగా మార్చుకుని, ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీని ఓడించాలని కంకణం కట్టుకున్న మొదటి వ్యక్తి ఆయననేనని, రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే తిరిగి తాను పార్టీలోకి వస్తానంటూ ఓట్లు వేయించుకునేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. వైసీపీకి ఊడిగి చేస్తూ కార్పొరేట్ కల్చర్‌తో భయపెట్టాలని చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో అతనికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పి.గిరిధర్, చిన్నా పాల్గొన్నారు.

రాజధాని పేరుతో విశాఖలో వైసీపీ రియల్ వ్యాపారం

- జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్


మాట్లాడుతున్న మూర్తియాదవ్

సీతంపేట, ఫిబ్రవరి 15: రాజధాని పేరుతో వైసీపీ పెద్దలు విశాఖలో రియల్ వ్యాపారం చేశారని, ఒక్క ఇటుక వేయలేదని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. పౌరగ్రంథాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటక ముసుగులో రుషికొండపై సీఎం క్యాంప్ ఆఫీస్ కట్టారని, తరువాత ట్రాన్సిట్ అని ఇప్పుడు సీఎం కార్యాలయం అంటున్నారన్నారు. సర్క్యూట్‌హౌస్, రైతుబజార్ తాకట్టు పెట్టి రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చారన్నారు. వైసీపీ వచ్చాక కనీసం ఒక్క పనీ చేయలేదని, నిర్మాణ వ్యయం పెంచి నిర్వాసితులను ముంచారన్నారు. రాష్ట్ర విభజన సమయంలో బొత్స సత్యనారాయణ ఏం చేశారని ప్రశ్నించారు.వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని, దీంతో పవన్ కల్యాణ్ ప్రచార సభకు హెలికాప్టర్ దిగేందుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో పీవీఎస్ఎన్ రాజు, నాగలక్ష్మి, రూపాదేవి, పోతు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వెలమ సామాజికవర్గానికి ప్రాధాన్యం కల్పించాలి'


సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న వెలమ సంఘాల రాష్ట్ర ప్రతినిధులు

సీతంపేట, ఫిబ్రవరి 15: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వెలమ సామాజికవర్గానికి అన్ని రాజకీయ పార్టీలు 23 అసెంబ్లీ, ఐదు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని వెలమ సంక్షేమ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 32 లక్షల జనాభా ఉన్నామన్నారు. త్వరలో రాజకీయ పార్టీల అధ్యక్షులను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. సమావేశంలో గంట అప్పలనాయుడు, బండారు రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, జి.రామారావు, జి.చిన్నమనాయుడు, బి.వరప్రసాద్, కె.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్' నిలిపివేత

- సినిమా మధ్యలో ఆపించిన రెవెన్యూ అధికారులు
- ప్రేక్షకులకు టికెట్ డబ్బులు తిరిగి చెల్లించిన యాజమాన్యం
- యంత్రాంగం చర్యలపై థియేటర్ వద్ద టీడీపీ నేతల నిరసన


థియేటర్ వద్ద పోస్టర్లపై అధికారులు అంటించిన కాగితాలు చూస్తున్న టీడీపీ నేతలు



సినిమా నిలిపివేశామని బోర్డు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 15: మద్దిలపాలెం కిన్నెర థియేటర్‌లో గురువారం రాజదాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మార్నింగ్ షో ప్రారంభించిన అరగంట తర్వాత సినిమా ప్రదర్శనను అర్ధంతరంగా నిలిపివేశారు. సినిమాపై హైకోర్టు స్టే ఇచ్చిందని, కేసు తేలే వరకు సినిమా ప్రదర్శించకూడదని హెచ్చరించారు. మధ్యలో ఆపేయడంతో ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. షో అయ్యాక ఆపేయండని చెప్పినా అధికారులు వినిపించుకోలేదు. తమకు పై నుంచి ఆదేశాలున్నాయన్నారు. దీంతో థియేటర్ యాజమాన్యం ప్రేక్షకులకు టికెట్ డబ్బులు తిరిగి చెల్లించి టెక్నికల్ సమస్యలతో సినిమా ప్రదర్శించడం లేదని బోర్డు పెట్టారు. సినిమా అర్థాంతరంగా నిలిపివేయడంతో కిన్నెర థియేటర్ వద్ద టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. ఎందుకు సినిమా ఆపారని నిర్వాహకులను నిలదీశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. టీడీపీ నగర కార్యదర్శి పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ రాజదానిపై వైసీపీ ప్రభుత్వం చేసిన కుట్రలు బయటపడతాయనే కోర్టుకు వెళ్లారన్నారు. దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. బలభద్రరాజు, సీహెచ్ వెంకటరావు, వెంకట్ పాల్గొన్నారు.

నాసా పోటీలకు రవీంద్రభారతి విద్యార్థుల ఎంపిక


నాసా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ గాయత్రిదేవి

మురళీనగర్, ఫిబ్రవరి 15: నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) పోటీలకు పలు విభాగాల్లో రవీంద్రభారతి విద్యార్థులు ఎంపికైనట్టు మురళీనగర్ స్కూలు ప్రిన్సిపాల్ బి.గాయత్రిదేవి తెలిపారు. ఈ ఏడాది మే 23న లాస్‌ఏంజెల్స్, కాలిఫోర్నియాల్లో జరిగే అంతర్జాతీయ సమ్మేళనంలో పాఠశాల నుంచి 14 విభిన్న ప్రాజెక్టులతో హాజరవుతారన్నారు. వీటిలో సొసైటీ ఆఫ్ స్పేస్ వాకర్స్, ఇన్నాటియో, కృత్రిమ పృథ్వీ, ఆకాష్ వంటి ప్రాజెక్టులున్నాయన్నారు. పాఠశాలల ఛైర్మన్ ఎం.ఎస్.మణి ప్రోత్సాహంతో బాలలకు సరైన దిశానిర్దేశం చేయగలుగుతున్నామని తెలిపారు. ఈ మేరకు గురువారం బాలలతో సమావేశం ఏర్పాటు చేసి పోటీల విధి విధానాలు, నియమ నిబంధనలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల విద్యార్థికి ప్రశంసలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: ఎడ్యుకేషనల్ ఎపిఫణి జిల్లా స్థాయి ప్రవేశ పరీక్షలో ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చింతపల్లి భరత్‌కు ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు గురువారం ఎంఈవో రామారావు, ఇన్‌చార్జి హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అతడిని అభినందించి సత్కరించారు. ఈ నెల 17న విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో బహుమతిని అందుకోనున్నాడు. విజయవాడ వెళ్లేందుకు ఖర్చుల నిమిత్తం పాఠశాల ఉపాధ్యాయులు రూ.2వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం, ఎంవీ ధర్మారావు, ఎ.సునంద్, ఎంఎన్‌వీ విశ్వనాథం, ఏజే జ్యోతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పతక విజేతకు అభినందనలు


హర్షశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జ్ఞానాపురం, ఫిబ్రవరి 15: నగరంలోని పోర్టు స్టేడియంలో జరుగుతున్న నిజి షోటోకాన్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగతపోటీలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థిని కడలి హర్షశ్రీ బంగారు పతకం సాధించింది. ఈ మేరకు గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆమెను అభినందించారు. కోచ్ ఎం.వి రమణ అధ్యాపకులు డాక్టర్ పీకే జయలక్ష్మి, డాక్టర్ అనుపమ, డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ మౌనమి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాల ప్రదానం


పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో మంత్రి అమర్‌నాథ్, తదితరులు

సిరిపురం, ఫిబ్రవరి 15 : రాష్ట్రంలోని వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం ఆయన సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు సేవామిత్ర, రత్న, వజ్ర పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 10,817 మంది వలంటీర్లకు పురస్కారాలతో సన్మానించామన్నారు. 32 మందికి సేవా వజ్ర, 115 మందికి సేవా రత్న, 10670 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రావాలంటే వలంటీర్లు కష్టపడి పనిచేయాలన్నారు. మేయర్ హరి వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు.

భీమిలి సెయింట్ ఆన్స్ స్కూల్స్ మూత?

సిబ్బందిని అప్పగించేందుకు సిద్ధమంటూ ప్రభుత్వానికి యాజమాన్యం లేఖ

భీమునిపట్నం, ఫిబ్రవరి 15: స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి విద్యారంగంలో విశేష సేవలందించిన భీమిలి సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, గర్ల్స్ హైస్కూల్ మూతపడనున్నట్టు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వానికి యాజమాన్యం ఒక లేఖ రాసినట్టు సమాచారం. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం తరగతుల వారీగా విద్యార్థుల తల్లిదండ్రులతో యాజమాన్య ప్రతినిధులు సమావేశం నిర్వహించి పాఠశాలను మూసివేస్తున్నట్టు తెలియజేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి పిల్లలను వేరే పాఠశాలల్లో చేర్పించుకోవాలని సూచించారు. పాఠశాలను కొనసాగించాలని తల్లిదండ్రులు కోరినా తాము ఏమీ చేయలేకపోతున్నామని అశక్తత తెలియ జేసినట్టు తెలిసింది. కాగా, ఈ స్కూల్‌ను 1940లో స్విట్జర్లాండుకు చెందిన సెయింట్ ఆన్స్ సిస్టర్స్ స్థాపించారు. 84 సంవత్సరాలుగా విద్యా సేవలు అందిస్తోంది. ఎయిడెడ్ పాఠశాల గా ఉండేది. అయితే రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలన్నీ ఆస్తులతో సహా తమకు అప్పగించాలని, లేదంటే సొంతంగా నడుపుకోవాలని, ఇకపై గ్రాంటు ఇవ్వలేమని తెలియజేసింది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా అనేక ఎయిడెడ్ పాఠశాలలు ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోయాయి. మరికొన్ని మూతపడ్డాయి. ఈ క్రమంలో కొద్ది సంవత్సరాలుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సెయింట్ ఆన్స్ యాజమాన్యం టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను అప్పగించేస్తామంటూ వారం క్రితం ప్రభుత్వానికి లేఖ రాసింది. త్వరలో జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఒక బృందం ఈ స్కూల్‌ను సందర్శించి తగు నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఎలిమెంటరీ విభాగంలో 360 మంది, ఉన్నత పాఠశాలలో 480 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కళ్లపై విద్యార్థులు శ్రద్ధ వహించాలి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 15: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ తమ కళ్లపై శ్రద్ధ వహించాలని జీవీఎంసీ ఆర్‌బీఎంయుపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ పిలుపునిచ్చారు. 31వ వార్డు ఆర్‌బీఎంయుపీ పాఠశాలలో ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కంటి ఉపయోకరమైన ఆహారాన్ని తీసుకుంటూ శ్రద్ధ వహించడం ద్వారా సంపూర్ణమైన దృష్టిని పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోడి దొరకు నేతల పరామర్శ

మహారాణిపేట, ఫిబ్రవరి 15: అనారోగ్యంతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న స్వాతంత్ర్య సమరయోధుడు మల్లు దొర మనుమడు బోడి దొరను గురువారం జిల్లా పరిషత్ ఛైర్మన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టి గుళ్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల చింతపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వంచాలి దుర్గాని, బోనంకి భవానీలను పరామర్శించారు. వారికి కూడా మెరుగైన వైద్యం అందించాలని కేజీహెచ్ వైద్యులకు సూచించారు.

అధికారులపై సీఎం అసంతృప్తి

... 5వ పేజీ తరువాయి

నేతలు కంగుతిన్నారు. అప్పటికప్పుడు సమీపంలోని ఇంజనీరింగ్, ఇంటర్ కాలేజీలకు ఫోన్లు చేసి విద్యార్థులను పంపించాలని అధికారులు ఆదేశించారు. అయినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సీఎం జగన్ స్టేడియంలోకి ప్రవేశించేసరికి జనాలు లేకపోవడంతో అవాక్కయ్యారు. స్టేడియంలోని గ్యాలరీలన్నీ ఖాళీగా ఉండిపోవడంతో అక్కడే పార్టీ నేతలపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ముందుగా అనుకున్నట్టు స్టేడియం చుట్టూ ఓపెన్ టాప్ జీపులో తిరుగుతూ ప్రజలకు అభివాదం చేసే కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఇక స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు మీడియా గ్యాలరీ దిగువన ప్రత్యేకంగా సీఎం కోసం ఏర్పాట్లు చేశారు. కానీ సీఎం అక్కడకు వెళ్లకుండా నేరుగా సభా వేదికపైకి వెళ్లిపోయారు. జన సమీకరణలో విఫలమవడంపై అధికారులను పిలిచి అప్పుడే తన అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు సమాచారం. వేదిక వద్ద అధికారులు కనీసం స్నాక్స్ కూడా ఏర్పాటుచేయకపోవడంతో దీనిపై కూడా సీఎం తీవ్రస్థాయిలో చీవాట్లు పెట్టినట్టు తెలిసింది. సీఎం ముభావంగా ఉండడంతో ముగింపు వేడుకల్లో భాగంగా రూ.80 లక్షలు వ్యయంతో ఏర్పాటుచేసిన డ్రోన్‌షోను కూడా అధికారులు రద్దుచేయాల్సి వచ్చింది. కార్యక్రమం ముగిసిన తర్వాత నేరుగా రోడ్డు మార్గంలో ఎయిర్‌పోర్టుకు వెళ్లిన సీఎం జగన్ అక్కడ జిల్లా అధికారులపై తన ఆగ్రహాన్ని వ్యక్తంచేసినట్టు సమాచారం. అంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కార్యక్రమం ముగింపు వేడుకను ఎంతో ఘనంగా చేస్తామని చెప్పి పూర్తిగా చెడగొట్టారని అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఎన్నికల ముందు ఇలాంటి పరిస్థితి పార్టీపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే స్పృహ కూడా లేదా?...అని ప్రశ్నించినట్టు సమాచారం. అక్కడితో శాంతించని సీఎం జగన్ బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఇదే అంశాన్ని మళ్లీ ప్రస్తావించినట్టు తెలిసింది. 'ఆడుదాం ఆంధ్రా' వైఫల్యంపై సీఎం ఆగ్రహంతో ఉన్నారనే అంశంపైనే ప్రస్తుతం జిల్లా అధికారుల మధ్య చర్చ జరుగుతోంది.

నా తలరాత జగనే రాస్తారు

... 5వ పేజీ తరువాయి

పూర్తయిన తరువాత విలేకరులతో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, సీఎం జగన్ రాసిన విధంగానే తన తలరాత ఉంటుందన్నారు. ఎన్ని కల్లో పోటీ చేస్తేనే రాజకీయాల్లో ఉన్నట్టా?, లేకపోతే లేనట్టేనా?...అని ఎదురు ప్రశ్నించారు. పార్టీ కోసం పనిచేయాల్సిన అవసరం వచ్చిందని గుర్తించి తనకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారన్నారు. తనకు ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్ పదవి ఇచ్చారన్నారు. జిల్లాలో వైసీపీ నుంచి పోటీ చేసే 15మంది అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనదేనన్నారు. పూర్తిస్థాయిలో పనిచేసి బాధ్యతలు నెరవేరుస్తానన్నారు.

చేజారుతున్న గ్రేటర్ ఆస్తులు

... 5వ పేజీ తరువాయి

చేసుకోవడంలో జీవీఎంసీ ఇప్పటికీ విజయవంతం కాలేదని, దీనికి ఎంఎస్‌సీలుగా పనిచేసిన వారిలో కొందరు వైఖరే కారణమని పేర్కొంటున్నారు. అలాగే నగర నడిబొడ్డున గెడ్డను ఆనుకుని ఉన్న 150 గజాల జీవీఎంసీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని భవన నిర్మాణం చేసేస్తున్నారని అధికార పార్టీకి చెందిన వార్డు స్థాయి నేతలు ఇద్దరు జీవీఎంసీ కమిషనర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్రమత్తమైన ఆక్రమణదారుడు ఆ ప్రాంత ఎంఎస్‌సీని సంప్రతించగా, ముందుగానే కోర్టు నుంచి తాత్కాలిక స్టే తెచ్చుకోవాలని సూచించారు. తర్వాత దీనిపై కొందరు హైకోర్టుకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇంకా కోర్టు నంబర్ కేటాయించకపోవడంతో ఇదే అదనుగా సంబంధిత నిర్మాణదారుడిని ఎంఎస్‌సీ పిలిచి కోర్టు నుంచి ఆర్డరు వస్తే ఇబ్బంది పడాల్సి ఉంటుందని బెదిరించి రూ.ఐదు లక్షలు లంచం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే కింది కోర్టు ఇచ్చిన తాత్కాలిక స్టేను రద్దు చేయించి, జీవీఎంసీ భూమిని పరిరక్షించాల్సిన ఎంఎస్‌సీయే దగ్గరుండి కబ్జాదారుడికి కొమ్ముకాయడం దారుణమని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇలాంటి కేసులు నగరంలో చాలా ఉన్నాయని, కమిషనర్ సాయికాంత్‌వర్మ ఇప్పటికైనా ఎంఎస్‌సీల పనితీరు, కోర్టులో పెండింగ్ కేసులపై ప్రత్యేకంగా దృష్టిసారించకపోతే నగర పాలక సంస్థ ఆస్తులన్నీ కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.



ఆక్రమణను కూల్చివేసిన దృశ్యం

ఎండాడలో ఆక్రమణలు తొలగింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని యాత కాలనీలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మించిన షెడ్‌లను అధికారులు తొలగించారు. 'జాగా కనిపిస్తే వేసే పాగా' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈమేరకు ఆర్ఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బంది కాలనీలోని కొండపై వేసిన షెడ్‌ను నేలమట్టం చేశారు. మిగతా ఆక్రమణలను కూడా త్వరలోనే తొలగిస్తామని తెలిపారు. ఆక్రమణదారులపై కేసులు కూడా నమోదు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ కనెక్షన్లు ఇవ్వరాదని ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు గంగరాజు, మనోజ్, యువరాజ్, గ్రేడ్ -1 వీఆర్వో సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 15: ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ దయనీయ పరిస్థితికి రావడానికి కారణం వైసీపీ ప్రభుత్వమేనని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పరిస్థితిని ఒకరోజు కూడా ప్రధాన మంత్రి మోదీ దృష్టికి సీఎం జగన్ తీసుకువెళ్లలేదన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టీల్ ప్లాంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ రాష్ట్రానికే తలమానికంగా ఉన్న ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మడి నరేంద్రకుమార్, నమ్మి సింహాద్రి, పి.శ్రీనివాస్, ఎం.రఘుప్రసాద్, ఎం.అప్పలనాయుడు, కిరణ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 15: మహిళలు విద్యావంతులు కావడంతో పాటు స్వయం ఉపాధి రంగంలోనూ తగిన ప్రావీణ్యాన్ని సాధించాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. సత్యసాయి భజన మండలి బెల్ హెచ్‌పీవీపీ సమితి ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెంలో మహిళలకు నిర్వహించిన టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు, వరదాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాలను తొలగించాలి

అగనంపూడి, ఫిబ్రవరి 15: అగనంపూడి కూడలికి సమీపంలోని శిథిలమైన పాత పంచాయతీ భవనాలను తొలగించాలని స్థానిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం వారు శిథిలమైన భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం శిథిలమైన ఈ భవనాలు ఆకతాయిలకు అడ్డాగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏరియా ఆస్పత్రికి ఆనుకుని ఉన్న ఈ భవనాలను తక్షణమే తొలగించి పార్కు ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అభివద్ధి కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి సత్యనారాయణ, కరణం పైడిరాజు, హనుమంతరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఈగెల్ :** జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శరత్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఈగెల్ :** మెలోడి, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం),
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** సంగం, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 17, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 20, క్యారెట్ 24, దొండకాయలు 34, బంగాళ దుంపలు 15, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 70, బరబాటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 36, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 84, పొటల్స్ 62, కీర దోస 28, క్యాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 30, కంద 54, దేముడు చిక్కుడు 34, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..


కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్


పాదయాత్రలో పాల్గొన్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్

నేటితో నిరసన దీక్షలకు 1,100 రోజులు పూర్తవుతున్నందున ధర్నా, రాస్తారోకో

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 15: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టనున్న కార్మిక సమ్మెను అన్ని వర్గాల వారు విజయవంతం చేయవలసిందిగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,099వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలతోనే కార్మిక హక్కులు పరిరక్షించబడతాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపడుతున్న సమ్మెను సక్సెస్ చేసేందుకు ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులతో పాటు అందరూ కృషి చేయాలన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ శుక్రవారం నాటికి ఉక్కు దీక్షలు చేపట్టి 1,100 రోజులు అవుతున్నందున కూర్మన్నపాలెంలో ధర్నా, రాస్తారోకో చేసేందుకు కార్మికులు సమాయత్తం కావాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్రం వెనక్కి తీసుకునేలా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. కేంద్రం తీరును నిరసిస్తూ రైతుల ఆగ్రహంతో ఢిల్లీ అట్టుడుగుతుందని, వారి స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, వేములపాటి ప్రసాద్, గంగవరం గోపి, యు.రామస్వామి, పరంధామయ్య, పి.సోమునాయుడు, డి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులంతా విధులు బహిష్కరించాలి

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఉక్కు కార్మికులకు నూతన వేతనాలను అందించాలన్న ప్రధాన డిమాండ్లతో శుక్రవారం చేపట్టనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయవలసిందిగా ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గం ఐక్యంగా సమ్మెలో పాల్గొని తమ నిరసనను


మల్కాపురంలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

యాజమాన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కార్మికులకు అన్ని విధాల అన్యాయం జరుగుతుందని, ఈ సమ్మెతోనైనా ఉక్కు యాజమాన్యం కళ్లు తెరవాలన్నారు. ప్రతిఒక్కరూ విధులు బహిష్కరించి కార్మిక సమ్మె సక్సెస్‌కు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరాం, కేఎస్ఎన్ రావు, ఎన్.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేపట్టిన నాయకులు

కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పాదయాత్ర చేపట్టారు. ప్లాంట్ కోకోఓవెన్ విభాగం నుంచి ప్రధాన గేటు వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కర్మాగారంలోని అన్ని సమస్యల పరిష్కారానికి ఉక్కు యాజమాన్యం ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, రాజశేఖర్, అయోధ్యరామ్, జె.రామకృష్ణ, ఎస్‌పి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు దూరంగా సీవీఎస్‌డబ్ల్యూ..

స్టీల్‌ప్లాంట్‌లో చేపట్టే కార్మిక సమ్మెకు సీవీఎస్ డబ్ల్యూ యూనియన్ పాల్గొనదని యూనియన్ అధ్యక్షుడు ఎం.రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి పట్టా రామఅప్పారావు తెలిపారు. కార్మిక హక్కులకు తూట్లు పొడిచే కార్మిక సంఘాలు చేసే సమ్మెలో తాము పాల్గొనేది లేదన్నారు. జాతీయ నాయకుల రాజకీయ లబ్ధి కోసం జరిగే సమ్మెలో ఉక్కు కార్మికులను బలి చేయటం తగదన్నారు. తమ యూనియన్ సభ్యులదరూ విధులకు హాజరవుతారని పేర్కొన్నారు.

మల్కాపురం: సమ్మెకు పారిశ్రామిక ప్రాంతంలోని కార్మిక సంఘాలన్నీ సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం కార్మిక నాయకులు పలుచోట్ల సమావేశాలు నిర్వహించడం, పరిశ్రమల అధికారులను కలిసి సమ్మెకు మద్దతివ్వాలని కోరారు. సమ్మెలో హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డు, డాక్‌యార్డు, బీపీసీఎల్, ఐఓసీ, ఈపీఎల్, ఎస్ఆర్, ఆర్‌సీఎల్, గొడౌన్స్ తదితర సంస్థల్లో పని చేస్తున్న కార్మికులతో పాటు పారిశుధ్య కార్మికులు కూడ పాల్గొననున్నారు. కాగా ఇంటక్, సీఐటీయూ, టీఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులు గురువారం హెచ్‌పీసీఎల్ అధికారులను కలిసి సమ్మెను విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ అన్యాయం చేస్తుందన్నారు.



గ్రీన్ సిటీలో జరిగిన సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

లోకేశ్ శంఖారావ సభల సక్సెస్‌తో వైసీపీలో గుబులు

19న పాత గాజువాక లంకా గ్రౌండ్‌లో సభ నిర్వహణ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 15: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం సభలు విజయవంతమవుతుండడంతో వైసీపీ శ్రేణుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. 88వ వార్డు పరిధి గ్రీన్‌సిటీలో గురువారం రాత్రి జరిగిన టీడీపీ గాజువాక నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న పాత గాజువాక లంకాగ్రౌండ్‌లో జరగనున్న నారా లోకేశ్ ఎన్నికల శంఖారావం సభకు అధిక సంఖ్యలో ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల సంగ్రామానికి టీడీపీ ఆర్మీ సిద్ధమా అంటూ కార్యకర్తల్లో ఆయన జోష్‌ను పెంచారు. ఈ ఎన్నికలు చాలా కీలకమైనవని, అందువల్ల కార్యకర్తలంతా పార్టీ గెలుపు కోసం శ్రమించాలన్నారు. కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక అని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. వైసీపీని తరిమికొట్టేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో వైసీపీ ఎంత డబ్బు పంచినా ప్రజలు దాన్ని తీసుకుని ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాజధాని లేని రాష్ట్రంగా, మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందని విమర్శించారు. దోచుకోవడం.. దాచుకోవడమే లక్ష్యంగా వైసీపీ నేతల పనితీరు ఉందని మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం సుమారు 25 ఏళ్లు వెనక్కి పోయిందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, ప్రజలు ఆనందంగా జీవించాలన్నా రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి గెలుపు చారిత్రాక అవసరమన్నారు. రాష్ట్ర కార్యదర్శి పుచ్చా విజయకుమార్ మాట్లాడుతూ ప్రజల్లో ఇప్పటికే మార్పు మొదలైందని, తమ ఓట్లు లేకపోయినా, ఎవరైనా దొంగ ఓట్లు వేద్దామని చూసినా తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్, ఎస్.అనంతలక్ష్మి, తమ్మిన విజయకుమార్, పులి వెంకటరమణారెడ్డి, వేగుంట శ్రీనివాస్, ఎం.కనకరాజు, చట్టి గోపి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, ఫిబ్రవరి 15: బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా సుసర్లకాలనీ, ఎన్ఏడీ ఎస్సీ కాలనీ, ఇందిరా ప్రియదర్శినికాలనీ, గాంధీనగర్, రెడ్డి వీధి, గవరవీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

కూర్మన్నపాలెం: వడ్లపూడి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా వడ్లపూడి, తిరుమలనగర్, ఆటోనగర్ ఈ-బ్లాక్, అపెరెల్ పార్కు, అప్పికొండ, లక్ష్మీపురం కాలనీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవి సబ్ స్టేషన్ పరిధి 33/11కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం రెండున్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. అందువల్ల అక్కిరెడ్డిపాలెం, మింది, రామ్‌నగర్, పంతులుగారి మేడ, పాత గాజువాక, విశాఖ డెయిరీ, నాతయ్యపాలెం, బీహెచ్‌పీవీ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పెందుర్తి: సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధి రాంపురం 11కేవీ ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలిగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు చినముషిడివాడ, ప్రసాద్‌నగర్, శ్రమశక్తినగర్ 3, ఆఖరి బస్టాప్, బంగారమ్మకాలనీ, సత్యానగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

వేపగుంట: నరవలోని 33/11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు, చెట్ల కొమ్మలను తొలగించనున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ డీవీ రమణమూర్తి తెలిపారు. కారణంగా నరవ, జెర్రిపోతులపాలెం, చింతగట్ల, ఇప్పిలివానిపాలెం, నందవానిపాలెం, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డును పరిశీలించిన గ్రేటర్ కమిషనర్

ఎన్.ఎ.డి. జంక్షన్, ఫిబ్రవరి 15: నగర పర్యటకు సీఎం జగన్ రానున్న నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ గురువారం ఉదయం ఎన్ఏడీ నుంచి చినముషిడివాడ వరకు పర్యటన చేపట్టారు. బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఇరుపక్కలా చెత్తాచెదారాలు లేకుండా చూడాలని, రోడ్డు సెంటర్‌లో మొక్కలు నాటాలని, కృష్ణానగర్‌లో నిరూపయోగంగా ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఎక్కడా అనధికారిక ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట జెడ్సీ కె.హైమావతి, ఈఈ రమణమూర్తి, ఏసీపీ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

'కార్మికులను భయభ్రాంతులకు గురి చేయవద్దు'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 15: కార్మికులను భయభ్రాంతులకు గురిచేసేలా ఉక్కు యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతి కోసం కార్మికులందరూ కృషి చేస్తుంటే వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా రోజుకొక నోటిఫికేషన్ ద్వారా భయపెడుతున్నారన్నారు. బంగారు బాతులాంటి స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రను తాము తిప్పికొడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ చర్యలను అందరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు కొవిరి అవతారం, బీఎన్ రాజు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, కొమ్ము ప్రసాద్, ఏఎస్ నాయుడు, డి.మోహన్, ఎం.ఈశ్వరరావు, మంత్రి గోపి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అభినందనలు

పెందుర్తి, ఫిబ్రవరి 15: గత నెల తెలంగాణ రాష్ట్రంలో గిన్నిస్ బుక్ రికార్డు కోసం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో స్థానిక ఆదిత్యనగర్‌లో ఉన్న యూనిక్ పాఠశాల విద్యార్థినులు పాల్గొని రికార్డు సాధించారు. ఈ నేపథ్యంలో గురువారం రాంపురంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థినులు నీలిమ, తన్విసాయి, నిత్యశ్రీ, ఆదిత్య, ఐశ్వర్య, అమృతశ్రీ, గౌరీసాయిలను అభినందించారు.


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో జేసీ మాయర్ అశోక్, తదితరులు

ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు

గాజువాక, ఫిబ్రవరి 15: గాజువాక ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో గురువారం ఇన్‌స్పైర్ మానక్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 204 నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించగా 64 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.మాయర్ అశోక్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, పాఠశాల ప్రిన్సిపాల్ జోజి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధినిచ్చే కోర్సులను యువత ఎంపిక చేసుకోవాలి

వేపగుంట, ఫిబ్రవరి 15: ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు ఉపాధి కల్పించే కోర్సులను యువత ఎంపిక చేసుకోవాలని శంకర్ ఫౌండేషన్ జీఎం కె.రాధాకృష్ణ పేర్కొన్నారు. నాయుడుతోట శంకర్ ఫౌండేషన్‌లో గురువారం బీఎస్సీ ఆప్టోమెట్రి కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో చికిత్సతో పాటు ఉపాధికి అవసరమైన పలు కోర్సులను నిర్వహించడమే కాకుండా కోర్సులు పూర్తి చేసిన వారికి ఉపాధి కల్పిస్తుండడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్టోమెట్రి ప్రిన్సిపాల్ ప్రొఫసర్ కె.కృష్ణప్రసాద్, డీజీఎంలు వి.రమేశ్‌కుమార్, బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ డ్రైవర్‌ను అభినందిస్తూ పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజారత్నం

ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి : డీటీసీ రాజారత్నం

వేపగుంట, ఫిబ్రవరి 15: ఆర్టీసీ అంటే సురక్షిత ప్రయాణం అన్న మాటను నిలుపుకునేందుకు ప్రతీ డ్రైవర్ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని డీటీసీ జీఈ రాజారత్నం అన్నారు. స్వచ్ఛత పక్వాడా ఉత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని నగరంలో అన్ని ఆర్టీసీ డిపోలకు చెందిన డ్రైవర్ల సన్మాన కార్యక్రమాన్ని గురువారం సింహాచలం డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కారణాలను విశ్లేషించగా అత్యధిక శాతం అతివేగంగా ప్రయాణించడం వల్ల, ఐదు శాతం రాంగ్ రూట్ కారణంగా, మరో ఐదు శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం, ఒకటిన్నర శాతం సెల్ ఫోన్ డ్రైవింగ్ కారణంగా తెలుస్తోందన్నారు. వీటన్నింటితో పాటు ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రతి డ్రైవర్ బస్సులను నడపాలని సూచించారు. ప్రమాదం జరిగితే తమ కుటుంబానికి అన్యాయం జరుగుతుందనే భావనతో వ్యవహరిస్తూ ప్రమాద రహిత డ్రైవింగ్ చేయాలన్నారు. పీటీడీ జోన్-1 ఈడీ సి.రవికుమార్ మాట్లాడుతూ ఆర్టీసీలో గతంలో 1.7 శాతం ప్రమాద రహితంగా ప్రయాణాలు సాగిస్తుంటే, ప్రస్తుతం 0.8 శాతం ప్రమాదాలు తగ్గేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. డీపీటీవో ఎ.అప్పలరాజు మాట్లాడుతూ డ్రైవింగ్‌లో మరింత మెలకువలను పెంపొందించేందుకు ఉత్తమ ప్రదర్శన చూపిన డ్రైవర్ల పర్యవేక్షణలో ఇతర డ్రైవర్లకు శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం డ్రైవర్లు ఎస్ఏఎన్ రాజు, ఆర్.దేముడు, ఆర్‌ఏ రావు, ఆర్ఎస్ రాజు, తదితరులకు రాజారత్నం, ఆర్టీసీ అధికారులు నగదుతో పాటు పలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాచలం డిపో మేనేజర్ కె.రాజశేఖర్ అసిస్టెంట్ మేనేజర్ సాయితులసి, ఇన్‌చార్జి మెకానికల్ మెంటెనెన్స్ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

భెల్ కార్మికుల నిరసన ప్రదర్శన

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా తిప్పికొట్టడం ద్వారా కార్మిక హక్కులను కాపాడుకోవచ్చని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి ఎంయూఎస్ఆర్ పట్నాయిక్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భెల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం భెల్ హెచ్‌పీవీపీ మెయిన్ గేటు వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి శుభాకర్ సాహు మాట్లాడుతూ శుక్రవారం జరగనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని కోరారు. కర్మాగారంలోని సమస్యలపై ఏప్రిల్ నెల నుంచి గుర్తింపు యూనియన్ పలు కార్యక్రమాలు చేపట్టనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి బాబూరావు, జీటీపీ ప్రకాశ్, పీవీఎన్ రాజు, ఎస్.జగన్నాథరావు, సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ'తో చేతివృత్తి కళాకారులకు మేలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, ఫిబ్రవరి 15: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతి వృత్తుల వారికి మేలు జరుగుతుందని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రమణి, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావులు పేర్కొన్నారు. గాజువాకలో గురువారం విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్దెనిమిది రకాల కులవృత్తిదారులకు తోడ్పాటునందించేందుకు పీఎం మోదీ ఈ పథకానికి రూపకల్పన చేశారన్నారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఆ సమయంలో రోజుకు రూ.ఐదు వందలు చెల్లించడం జరుగుతుందన్నారు. అందువల్ల చేతివృత్తుల వారంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశ్రమల శాఖ ఏడీ ఎ.శ్రీనివాస్, పలువురు అధికారులు, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.

సీఐఐతో 2047కి అగ్రగామిగా దక్షిణ భారతదేశం

ఆర్థిక వృద్ధి నగరాలు విశాఖ, విజయవాడ

సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ కమల్ బాలి


...మాట్లాడుతున్న కమల్ బాలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 15: దక్షిణాది రాష్ట్రాల్లో ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించేందుకు పరిశ్రమల్లో పోటీతత్వంతో పాటు వృద్ధి, సుస్థిరత, నమ్మకం అనే మూడు అంశాల ద్వారా బలోపేతం చేస్తున్నామని సీఐఐ (భారత పరిశ్రమల సమాఖ్య) సదరన్ రీజియన్ చైర్మన్ కమల్ బాలి అన్నారు. గురువారం ఆయన బీచ్ రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2047కి దక్షిణ భారతాన్ని మార్చడానికి తొమ్మిది అంశాలపై దృష్టిసారిస్తున్నామని, వాటిలో ప్రజల సంస్కృతి, పునరుజ్జీవనం, శక్తి పరివర్తన, భాగస్వామ్య సహకారం, అంతర్జాతీయ అనుసంధానం, ఈఎస్‌జీ అజెండా, ఇన్నోవేషన్, స్టార్టప్‌లు, ఎకోసిస్టం, ఎంఎస్ఎంఈలు, సాంకేతికను వినియోగించుకోవడం, డిజిటల్ వ్యవస్థలను ప్రోత్సహించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నామన్నారు. వీటివల్ల ప్రపంచ గమ్యస్థానంగా భారత్ హోదా పెరుగుతుందన్నారు. ఏపీలో విశాఖ, విజయవాడ ఆర్థికవృద్ధికి మంచి నగరాలని చెప్పారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ విభాగం చైర్మన్ డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఏపీలో ఆక్వా రంగంలో మంచి అవకాశాలున్నాయన్నారు. సమావేశంలో వారితో పాటు సీఐఐ సదరన్ రీజియన్ రీజనల్ డైరెక్టర్ ఎన్ఎంపీ జయేష్ కూడా ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 15: జీవీఎంసీ 68వ వార్డు పరిధిలో సుమారు రూ.కోటీ 24 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ 'గాజువాక' సమన్వయకర్త ఉరుకూటి చందు, కార్పొరేటర్ గుడివాడ అనూష, వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, ఎస్.నూకరాజు, వి.రమణ, శ్రీరాములు, సురేశ్, ఎన్.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

అప్సా ఉపాధ్యక్షుడిగా వాసుదేవరావు



కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 15: ఇటీవల తిరుపతిలో జరిగిన ఏపీ ప్రైవేటు పాఠశాలల సంఘం (అప్సా) రాష్ట్ర మహాసభల్లో విశాఖ జిల్లాలోని కూర్మన్నపాలేనికి చెందిన రామకృష్ణ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ పొన్నాడ వాసుదేవరావును రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాగా రాష్ట్ర ఫైనాన్సియల్ సెక్రటరీగా జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావును ఎన్నుకున్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

పెందుర్తి-రూరల్, ఫిబ్రవరి 15: నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.టి.శ్రీనివాస్, నాంది ఫౌండేషన్ ప్రతినిధులు సంతోషి, విద్యా కమిటీ ప్రతినిధులు చైర్మన్ స్వాతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన జేసీ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: వార్డు సచివాలయాల్లో పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ కె.మయూర్ అశోక్ గురువారం పరిశీలించారు. తాటిచెట్లపాలెం, నర్సింహనగర్‌లోని వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. అధికారులకు, సచివాలయ సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని రిజిస్ట్రేషన్లు చేశారు, ఎంత సమయం పడుతుందనే అంశాలపై ఆరా తీశారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కొంతమంది లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రగతి నివేదికలను పరిశీలించారు.

రహదారి నిబంధనలపై అవగాహన

కంచరపాలెం, ఫిబ్రవరి 15: రోడ్డు భద్రతా నియమాలపై కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశాఖ డీటీసీ రాజారత్నం ముఖ్యఅతిథిగా హాజరై అవగాహన కల్పించారు. వాహనచోదకులు నియమాలను విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఆర్‌సీహెచ్.శ్రీనివాస్, రఘుబాబు, శ్రీకాంత్, ఉమాశంకర్‌పాల్గొన్నారు.

డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15: డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పార్వతీపురం స్టేషన్‌లో మౌలిక సదుపాయల నిర్వహణను పరిశీలించారు. అలాగే 12 మీటర్ల వెడల్పుతో పాదచారుల వంతెన, పార్కింగ్, పరిసర ప్రాంతంతోపాటు స్టేషన్ భవనం అభివృద్ధి నిర్మాణ పనులకు సంబంధించిన ప్రణాళికలపై సమీక్షించారు. అనంతరం అక్కడకు చేరిన వివిధ సంఘాల స్థానిక ప్రతినిధుల చెప్పిన పలు సమస్యలు, సూచనలపై స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం బొబ్బిలి స్టేషన్‌కు చేరుకుని అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పాదచారుల వంతెన, వెయిటింగ్ హాల్స్, ఇతర అభివృద్ధి నిర్మాణ పనులకు సంబంధించి ప్రణాళికలను పరిశీలించారు. అక్కడ నుంచి కోరాపుట్ స్టేషన్‌కు చేరుకుని అభివృద్ధి నిర్మాణ పనులపై అధికారులతో చర్చించారు. ఈ తనిఖీలలో డీఆర్ఎంతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

మాధవధార, ఫిబ్రవరి 15: గ్రేటర్ 50వవార్డులో గురువారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. కీళ్ల నొప్పులు, కండరాల సమస్యల నివారణకు ఫిజియో థెరపిస్టు పి.శ్రీరామ్ శ్రీనివాస్ పరీక్షించారు. వ్యాయామాలను సూచించారు. వాకర్స్ క్లబ్ మురళీనగర్ అధ్యక్షుడు పి.చంద్రమౌళి, కార్యదర్శి పి.సెల్వరాజు పర్యవేక్షించారు.

కిటకిటలాడిన పూర్ణామార్కెట్

- రథసప్తమికి పూజా సామగ్రి కొనుగోళ్లు
- భారీగా తరలివచ్చిన నగర వాసులు
- అధిక ధరలు పలికిన పళ్లు, పూలు


కొనుగులు దారులతో రద్దీగా పూర్ణామార్కెట్


రోడ్డుపైనే విక్రయాలు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 15: కొనుగోలుదారులతో పూర్ణామార్కెట్ గురువారం సాయంత్రం కిటకిటలాడింది. రథసప్తమి పర్వదినం సందర్భంగా పూజాసామగ్రి కొనుగోలుకు భారీ సంఖ్యలో నగరవాసులు తరలివచ్చారు. దీంతో రోడ్డు మీద వ్యాపారులు పూజా సమగ్రి ధరలను అమాంతం పెంచేశారు. జిల్లేడు, అరటి ఆకు ధర చూస్తే విస్తుపోవాల్సిందే. రేగుకాయలు గ్లాసు 40 రూ..చెరకు ముక్కలు రెండు 30కి విక్రయించారు. అరటి పండ్ల ఫెడ రూ.150 కాగా, కొబ్బరికాయలు ఒకటి రూ.30కి పైగా అమ్మకాలు జరిపారు. పండగ సమయంలో పూర్ణా మార్కెట్ రహదారులపై చిరువ్యాపారులు ధరలు భారీగా పెంచి విక్రయించడం ఆనవాయితీగా జరుగుతోంది. పండ్లు, పూల ధరలు మరింతగా పెరగడంతో కొనుగోలుదారులు గగ్గోలుపెట్టారు. దీనికి తోడు బుధవారంతో పోల్చి చూస్తే కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి.

ట్రాఫిక్ నియంత్రణ లోప భూయిష్టం

రహదారులు, పార్కింగ్ స్థలాలను ఆక్రమించి వ్యాపారులు సాగించే వారికి స్థానిక అధికార పార్టీ నాయకులు మద్దతుగా నిలవడంతో పూర్ణామార్కెట్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిని తొలగించేందుకు యత్నించినా వైసీపీ పెద్దలతో చీవాట్లు తినాల్సి వస్తోందని, పోలీసులు వాటిపైపు చూడడం మానేశారు.

ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికి ఇచ్చినా సహకరించాలి

- టీడీపీ ఉత్తర నియోజవర్గ నేతల సమావేశంలో నిర్ణయం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: ఉత్తర నియోజకవర్గం టీడీపీ భవిష్యత్తు కార్యాచరణపై నరసింహనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, వార్డుల అధ్యక్షులు, సెక్రటరీలు పాల్గొన్న సమావేశంలో నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బాధ్యత ఎవరు చేపట్టాలనే విషయంపై చర్చించారు. ఎవరికి బాధ్యతలు అప్పగించినా ఉమ్మడిగా సహకరించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 18వ తేదీన ఉత్తర నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో జరగబోయే శంఖారావం కార్యక్రమానికి భారీసంఖ్యలో జనాలను సమీకరించి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ, 45వ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు, 26వ ఆర్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, నేతలు మేకా సత్యకిరణ్, పీవీ వసంతరావు, ఆకిరెడ్డి జగదీష్, తాతినేని శ్రీనివాసరావు, పాతురు మురళీ శేఖర్, మొర్తా రాజారావు, పుక్కళ్ళ పైడికొండ, ఆర్వీ రమణ, ధనాజీ, పామోటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు స్టేడియంలో పెన్ ఒలిపింక్స్


జెండా ఆవిష్కరిస్తున్న లింగేశ్వరరావు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: పోర్టు జూబ్లీ గ్రౌండ్‌లో గురువారం పెన్ ఒలింపిక్స్ పేరిట వార్షిక స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ షటిల్ ఆటగాడు బీవీఎస్‌కే లింగేశ్వరరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో పాల్గొంటే ఒలింపిక్‌కు దోహదపడతాయని చెప్పారు. స్పోర్ట్స్ మీట్‌లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఏరోబిక్స్, హరాప్ డ్రిల్, రేసేస్ తదితర ఈవెంట్లలో సత్తా చాటారు. కార్యక్రమంలో అనితా పెరీరా, ఉపాధ్యాయులు, పీటీ మాస్టార్లు పాల్గొన్నారు.

బస్ బే బస్ షెల్టర్లు ప్రారంభం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: అక్కయ్యపాలెం, పోర్టు ఆస్పత్రి జంక్షన్‌లో రూ.1.7 కోట్ల వ్యయంతో నిర్మించిన బస్ బే షెల్టర్లను నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బానాల శ్రీనివాసరావు, కంపా హనోక్, కె.అనిల్‌కుమార్ రాజు, ఏఈఉలు రమణమ్మ, ఉమామహేశ్వరరావు, పోతల కన్నపుడు, ఇజ్జు సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి వేడుకలు

అల్లిపురం, ఫిబ్రవరి 15: స్థానిక వెంకటేశ్వరమెట్ట వద్ద గల అలమేలు మంగమ్మ దేవాలయ ప్రాంగణంలో గల ఉపాలయంలో ఉషా ఛాయాదేవి సమేత శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు జరగున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు పి.కేశవాచార్యులు తెలిపారు. స్వామి వారి జయంతిలో భాగమైన ఉత్సవంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ధర్మకర్త యల్లపు హరికృష్ణ కోరారు.

టీడీపీ ఓట్లు కాజేసేందుకు ఆడారి కుట్ర

- పార్టీ జిల్లా కార్యదర్శి పాశర్ల ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న పాశర్ల ప్రసాద్

మహారాణిపేట, ఫిబ్రవరి 15: ఆడారి తులసీరావు ఆంధ్రా కొరియన్ కాదని ఆంధ్రా అదానీ అని తెలుగు దేశం పార్టీ జిల్లా కార్యదర్శి పాశర్ల ప్రసాద్ విమర్శించారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తులసీరావు డెయిరీని అడ్డుపెట్టుకుని రూ.కోట్లు ఆర్జించారన్నారు. ప్రస్తుతం ఆడారి ఆనంద్ టీడీపీని ఓడించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారన్నారు. విశాఖ డెయిరీని జేబు సంస్థగా మార్చుకుని, ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీని ఓడించాలని కంకణం కట్టుకున్న మొదటి వ్యక్తి ఆయననేనని, రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే తిరిగి తాను పార్టీలోకి వస్తానంటూ ఓట్లు వేయించుకునేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. వైసీపీకి ఊడిగి చేస్తూ కార్పొరేట్ కల్చర్‌తో భయపెట్టాలని చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో అతనికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పిగిరిధర్, చిన్నా పాల్గొన్నారు.

రాజధాని పేరుతో విశాఖలో వైసీపీ రియల్ వ్యాపారం

- జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్


మాట్లాడుతున్న మూర్తియాదవ్

సీతంపేట, ఫిబ్రవరి 15: రాజధాని పేరుతో వైసీపీ పెద్దలు విశాఖలో రియల్ వ్యాపారం చేశారని, ఒక్క ఇటుక వేయలేదని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. పౌరగ్రంథాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటక ముసుగులో రుషికొండపై సీఎం క్యాంప్ ఆఫీస్ కట్టారని, తరువాత ట్రాన్సిట్ అని ఇప్పుడు సీఎం కార్యాలయం అంటున్నారన్నారు. సర్క్యూట్‌హౌస్, రైతుబజార్ తాకట్టు పెట్టి రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చారన్నారు. వైసీపీ వచ్చాక కనీసం ఒక్క పనీ చేయలేదని, నిర్మాణ వ్యయం పెంచి నిర్వాసితులను ముంచారన్నారు. రాష్ట్ర విభజన సమయంలో బొత్స సత్యనారాయణ ఏం చేశారని ప్రశ్నించారు.వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని, దీంతో పవన్ కల్యాణ్ ప్రచార సభకు హెలికాప్టర్ దిగేందుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో పీవీఎస్ఎన్ రాజు, నాగలక్ష్మి, రూపాదేవి, పోతు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వెలమ సామాజికవర్గానికి ప్రాధాన్యం కల్పించాలి'


సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న వెలమ సంఘాల రాష్ట్ర ప్రతినిధులు

సీతంపేట, ఫిబ్రవరి 15: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వెలమ సామాజికవర్గానికి అన్ని రాజకీయ పార్టీలు 23 అసెంబ్లీ, ఐదు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని వెలమ సంక్షేమ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 32 లక్షల జనాబా ఉన్నామన్నారు. త్వరలో రాజకీయ పార్టీల అధ్యక్షులను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. సమావేశంలో గంట అప్పలనాయుడు, బండారు రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, జి.రామారావు, జి.చిన్నమనాయుడు, బి.వరప్రసాద్, కె.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్' నిలిపివేత

- సినిమా మధ్యలో ఆపించిన రెవెన్యూ అధికారులు
- ప్రేక్షకులకు టికెట్ డబ్బులు తిరిగి చెల్లించిన యాజమాన్యం
- యంత్రాంగం చర్యలపై థియేటర్ వద్ద టీడీపీ నేతల నిరసన


థియేటర్ వద్ద పోస్టర్లపై అధికారులు అంటించిన కాగితాలు చూస్తున్న టీడీపీ నేతలు



సినిమా నిలిపివేశామని బోర్డు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 15: మద్దిలపాలెం కిన్నెర థియేటర్‌లో గురువారం రాజదాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మార్నింగ్ షో ప్రారంభించిన అరగంట తర్వాత సినిమా ప్రదర్శనను అర్థంతరంగా నిలిపివేశారు. సినిమాపై హైకోర్టు స్టే ఇచ్చిందని, కేసు తేలే వరకు సినిమా ప్రదర్శించకూడదని హెచ్చరించారు. మధ్యలో ఆపేయడంతో ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. షో అయ్యాక ఆపేయండని చెప్పినా అధికారులు వినిపించుకోలేదు. తమకు పై నుంచి ఆదేశాలున్నాయన్నారు. దీంతో థియేటర్ యాజమాన్యం ప్రేక్షకులకు టికెట్ డబ్బులు తిరిగి చెల్లించి టెక్నికల్ సమస్యలతో సినిమా ప్రదర్శించడం లేదని బోర్డు పెట్టారు. సినిమా అర్ధాంతరంగా నిలిపివేయడంతో కిన్నెర థియేటర్ వద్ద టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. ఎందుకు సినిమా ఆపారని నిర్వహకులను నిలదీశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. టీడీపీ నగర కార్యదర్శి పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ రాజదానిపై వైసీపీ ప్రభుత్వం చేసిన కుట్రలు బయటపడతాయనే కోర్టుకు వెళ్లారన్నారు. దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. బలభద్రరాజు, సీహెచ్ వెంకటరావు, వెంకట్ పాల్గొన్నారు.

నాసా పోటీలకు రవీంద్రభారతి విద్యార్థుల ఎంపిక


నాసా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ గాయత్రిదేవి

మురళీనగర్, ఫిబ్రవరి 15: నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) పోటీలకు పలు విభాగాల్లో రవీంద్రభారతి విద్యార్థులు ఎంపికైనట్టు మురళీనగర్ స్కూలు ప్రిన్సిపాల్ బి.గాయత్రిదేవి తెలిపారు. ఈ ఏడాది మే 23న లాస్‌ఏంజెల్స్, కాలిఫోర్నియాల్లో జరిగే అంతర్జాతీయ సమ్మేళనంలో పాఠశాల నుంచి 14 విభిన్న ప్రాజెక్టులతో హాజరవుతారన్నారు. వీటిలో సొసైటీ ఆఫ్ స్పేస్ వాకర్స్, ఇన్నొటియో, కృత్రిమ పృథ్వీ, ఆకాష్ వంటి ప్రాజెక్టులున్నాయన్నారు. పాఠశాలల చైర్మన్ ఎం.ఎస్.మణి ప్రోత్సాహంతో బాలలకు సరైన దిశానిర్దేశం చేయగలుగుతున్నామని తెలిపారు. ఈ మేరకు గురువారం బాలలతో సమావేశం ఏర్పాటు చేసి పోటీల విధి విధానాలు, నియమ నిబంధనలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎన్.వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల విద్యార్థికి ప్రశంసలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 15: ఎడ్యుకేషనల్ ఎపిఫని జిల్లా స్థాయి ప్రవేశ పరీక్షలో ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చింతపల్లి భరత్‌కు ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు గురువారం ఎంఈవో రామారావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అతడిని అభినందించి సత్కరించారు. ఈ నెల 17న విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో బహుమతిని అందుకోనున్నాడు. విజయవాడ వెళ్లేందుకు ఖర్చుల నిమిత్తం పాఠశాల ఉపాధ్యాయులు రూ.2వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం, ఎంవీ ధర్మారావు, ఎ.సునంద్, ఎంఎస్‌వీ విశ్వనాథం, ఏజే జ్యోతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పతక విజేతకు అభినందనలు


హర్షశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జ్ఞానాపురం, ఫిబ్రవరి 15: నగరంలోని పోర్టు స్టేడియంలో జరుగుతున్న నిజి షోటోకాన్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగతపోటీలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థిని కడలి హర్షశ్రీ బంగారు పతకం సాధించింది. ఈ మేరకు గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆమెను అభినందించారు. కోచ్ ఎం.వి రమణ అధ్యాపకులు డాక్టర్ పీకే జయలక్ష్మి, డాక్టర్ అనుపమ, డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ మౌనమి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాల ప్రదానం


పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో మంత్రి అమర్‌నాథ్, తదితరులు

సిరిపురం, ఫిబ్రవరి 15 : రాష్ట్రంలోని వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం ఆయన సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు సేవామిత్ర, రత్న, వజ్ర పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 10,817 మంది వలంటీర్లకు పురస్కారాలతో సన్మానించామన్నారు. 32 మందికి సేవా వజ్ర, 115 మందికి సేవా రత్న, 10670 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రావాలంటే వలంటీర్లు కష్టపడి పనిచేయాలన్నారు. మేయర్ హరి వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు.

భీమిలి సెయింట్ ఆన్స్ స్కూల్స్ మూత?

సిబ్బందిని అప్పగించేందుకు సిద్ధమంటూ ప్రభుత్వానికి యాజమాన్యం లేఖ

భీమునిపట్నం, ఫిబ్రవరి 15: స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి విద్యారంగంలో విశేష సేవలందించిన భీమిలి సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, గర్ల్స్ హైస్కూల్ మూతపడనున్నట్టు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వానికి యాజమాన్యం ఒక లేఖ రాసినట్టు సమాచారం. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం తరగతుల వారీగా విద్యార్థుల తల్లిదండ్రులతో యాజమాన్య ప్రతినిధులు సమావేశం నిర్వహించి పాఠశాలను మూసివేస్తున్నట్టు తెలియజేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి పిల్లలను వేరే పాఠశాలల్లో చేర్పించుకోవాలని సూచించారు. పాఠశాలను కొనసాగించాలని తల్లిదండ్రులు కోరినా తాము ఏమీ చేయలేకపోతున్నామని అశక్తత తెలియజేసినట్టు తెలిసింది. కాగా, ఈ స్కూల్‌ను 1940లో స్విట్జర్లాండుకు చెందిన సెయింట్ ఆన్స్ సిస్టర్స్ స్థాపించారు. 84 సంవత్సరాలుగా విద్యాసేవలు అందిస్తోంది. ఎయిడెడ్ పాఠశాల గా ఉండేది. అయితే రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలన్నీ ఆస్తులతో సహా తమకు అప్పగించాలని, లేదంటే సొంతంగా నడుపుకోవాలని, ఇకపై గ్రాంటు ఇవ్వలేమని తెలియజేసింది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా అనేక ఎయిడెడ్ పాఠశాలలు ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోయాయి. మరికొన్ని మూతపడ్డాయి. ఈ క్రమంలో కొద్ది సంవత్సరాలుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సెయింట్ ఆన్స్ యాజమాన్యం టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను అప్పగించేస్తామంటూ వారం క్రితం ప్రభుత్వానికి లేఖ రాసింది. త్వరలో జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఒక బృందం ఈ స్కూల్‌ను సందర్శించి తగు నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఎలిమెంటరీ విభాగంలో 360 మంది, ఉన్నత పాఠశాలలో 480 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కళ్లపై విద్యార్థులు శ్రద్ధ వహించాలి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 15: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ తమ కళ్లపై శ్రద్ధ వహించాలని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ పిలుపునిచ్చారు. 31వ వార్డు ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కంటి ఉపయోకరమైన ఆహారాన్ని తీసుకుంటూ శ్రద్ధ వహించడం ద్వారా సంపూర్ణమైన దృష్టిని పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోడి దొరకు నేతల పరామర్శ

మహారాణిపేట, ఫిబ్రవరి 15: అనారోగ్యంతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న స్వాతంత్ర్య సమరయోధుడు మల్లు దొర మనుమడు బోడి దొరను గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టి గుళ్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల చింతపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వంచాలి దుర్గాని, బోనంకి భవానీలను పరామర్శించారు. వారికి కూడా మెరుగైన వైద్యం అందించాలని కేజీహెచ్ వైద్యులకు సూచించారు.

అధికారులపై సీఎం అసంతృప్తి

... 5వ పేజీ తరువాయి

నేతలు కంగుతిన్నారు. అప్పటికప్పుడు సమీపంలోని ఇంజనీరింగ్, ఇంటర్ కాలేజీలకు ఫోన్లు చేసి విద్యార్థులను పంపించాలని అధికారులు ఆదేశించారు. అయినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సీఎం జగన్ స్టేడియంలోకి ప్రవేశించేసరికి జనాలు లేకపోవడంతో అవాక్కయ్యారు. స్టేడియంలోని గ్యాలరీలన్నీ ఖాళీగా ఉండిపోవడంతో అక్కడే పార్టీ నేతలపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ముందుగా అనుకున్నట్టు స్టేడియం చుట్టూ ఓపెన్ టాప్ జీపులో తిరుగుతూ ప్రజలకు అభివాదం చేసే కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఇక స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు మీడియా గ్యాలరీ దిగువన ప్రత్యేకంగా సీఎం కోసం ఏర్పాట్లు చేశారు. కానీ సీఎం అక్కడకు వెళ్లకుండా నేరుగా సభా వేదికపైకి వెళ్లిపోయారు. జన సమీకరణలో విఫలమవడంపై అధికారులను పిలిచి అప్పుడే తన అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు సమాచారం. వేదిక వద్ద అధికారులు కనీసం స్నాక్స్ కూడా ఏర్పాటుచేయకపోవడంతో దీనిపై కూడా సీఎం తీవ్రస్థాయిలో చీవాట్లు పెట్టినట్టు తెలిసింది. సీఎం ముభావంగా ఉండడంతో ముగింపు వేడుకల్లో భాగంగా రూ.80 లక్షలు వ్యయంతో ఏర్పాటుచేసిన డ్రోన్‌షోను కూడా అధికారులు రద్దుచేయాల్సి వచ్చింది. కార్యక్రమం ముగిసిన తర్వాత నేరుగా రోడ్డు మార్గంలో ఎయిర్‌పోర్టుకు వెళ్లిన సీఎం జగన్ అక్కడ జిల్లా అధికారులపై తన ఆగ్రహాన్ని వ్యక్తంచేసినట్టు సమాచారం. అంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కార్యక్రమం ముగింపు వేడుకను ఎంతో ఘనంగా చేస్తామని చెప్పి పూర్తిగా చెడగొట్టారని అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఎన్నికల ముందు ఇలాంటి పరిస్థితి పార్టీపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే స్పృహ కూడా లేదా?...అని ప్రశ్నించినట్టు సమాచారం. అక్కడితో శాంతించని సీఎం జగన్ బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఇదే అంశాన్ని మళ్లీ ప్రస్తావించినట్టు తెలిసింది. 'ఆడుదాం ఆంధ్రా' వైఫల్యంపై సీఎం ఆగ్రహంతో ఉన్నారనే అంశంపైనే ప్రస్తుతం జిల్లా అధికారుల మధ్య చర్చ జరుగుతోంది.

నా తలరాత జగనే రాస్తారు

... 5వ పేజీ తరువాయి

పూర్తయిన తరువాత విలేకరులతో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, సీఎం జగన్ రాసిన విధంగానే తన తలరాత ఉంటుందన్నారు. ఎన్ని కల్లో పోటీ చేస్తేనే రాజకీయాల్లో ఉన్నట్టా?, లేకపోతే లేనట్టేనా?...అని ఎదురు ప్రశ్నించారు. పార్టీ కోసం పనిచేయాల్సిన అవసరం వచ్చిందని గుర్తించి తనకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారన్నారు. తనకు ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్ పదవి ఇచ్చారన్నారు. జిల్లాలో వైసీసీ నుంచి పోటీ చేసే 15మంది అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనదేనన్నారు. పూర్తిస్థాయిలో పనిచేసి బాధ్యతలు నెరవేరుస్తానన్నారు.

చేజారుతున్న గ్రేటర్ ఆస్తులు

... 5వ పేజీ తరువాయి

చేసుకోవడంలో జీవీఎంసీ ఇప్పటికీ విజయవంతం కాలేదని, దీనికి ఎంఎస్‌సీలుగా పనిచేసిన వారిలో కొందరు వైఖరే కారణమని పేర్కొంటున్నారు. అలాగే నగర నడిబొడ్డున గెడ్డను ఆనుకుని ఉన్న 150 గజాల జీవీఎంసీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని భవన నిర్మాణం చేసేస్తున్నారని అధికార పార్టీకి చెందిన వార్డు స్థాయి నేతలు ఇద్దరు జీవీఎంసీ కమిషనర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్రమత్తమైన ఆక్రమణదారుడు ఆ ప్రాంత ఎంఎస్‌సీని సంప్రతించగా, ముందుగానే కోర్టు నుంచి తాత్కాలిక స్టే తెచ్చుకోవాలని సూచించారు. తర్వాత దీనిపై కొందరు హైకోర్టుకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇంకా కోర్టు నంబర్ కేటాయించకపోవడంతో ఇదే అదనుగా సంబంధిత నిర్మాణదారుడిని ఎంఎస్‌సీ పిలిచి కోర్టు నుంచి ఆర్డరు వస్తే ఇబ్బంది పడాల్సి ఉంటుందని బెదిరించి రూ.ఐదు లక్షలు లంచం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే కింది కోర్టు ఇచ్చిన తాత్కాలిక స్టేను రద్దు చేయించి, జీవీఎంసీ భూమిని పరక్షించాల్సిన ఎంఎస్‌సీయే దగ్గరుండి కబ్జాదారుడికి కొమ్ముకాయడం దారుణమని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇలాంటి కేసులు నగరంలో చాలా ఉన్నాయని, కమిషనర్ సాయికాంత్‌వర్మ ఇప్పటికైనా ఎంఎస్‌సీల పనితీరు, కోర్టుల్లో పెండింగ్ కేసులపై ప్రత్యేకంగా దృష్టిసారించకపోతే నగర పాలక సంస్థ ఆస్తులన్నీ కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

జోన్ వన్ జడ్సీగా కనకమహాలక్ష్మి

భీమునిపట్నం, ఫిబ్రవరి 15 : భీమిలి జోనల్ (1) కమిషనర్‌గా కొట్యాడ కనకమహాలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈనెల 9న రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి శైలజ వల్లి బదిలీపై ఇక్కడికి జడ్సీగా వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె జోన్ టూ జడ్సీగా బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్టు ఆఫీసరుగా పని చేస్తున్న కనకమహాలక్ష్మి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన జడ్సీకి కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికారు.

'అవకాశాలను అందిపుచ్చుకోవాలి'

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 15 : విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ డెప్యూటీ జనరల్ మేనేజర్ పి. రమేష్ అన్నారు. గురువారం ఎంవీపీ కాలనీలోని జీవీపీ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో హైబ్రీడ్ మోడ్‌లో ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ డి. శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రజని, డైరెక్టర్ ఆనంద్, ప్రొఫెసర్ రాజగణపతి, తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి

తగరపువలస, ఫిబ్రవరి 15 : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం జరిగే దేశవ్యాప్త బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వారు తగరపువలసలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు కానూరి రాంబాబు మాట్లాడుతూ భీమిలి, తగరపువలసలోని అన్ని ప్రాంతాల్లోనూ లారీలు, ఇతర ట్రాన్స్‌పోర్టు వాహనాలను వాహనదారులు నిలిపివేయాలని కోరారు. ఈ సమావేశంలో వామపక్షాల నాయకులు ఆర్. నరసింగరావు, రమణ, మొర అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీవి అన్నీ అవాస్తవలే'

కొమ్మాది, ఫిబ్రవరి 15 : అవాస్తవాలను ప్రచారం చేయడంలో వైసీపీ నాయకులు సిద్ధహస్తులని టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన పీఎంపాలెంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీకి మీడియా లేదని చెబుతున్నారని, కానీ వారికి ఒక పేపర్, వెయ్యికి పైగా యూట్యూబ్ చానల్స్ ఉన్నాయన్నారు. వాటితో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని ఆయన హెచ్చరించారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఫిబ్రవరి 15 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా జరిపారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు బంగారు సంపెంగలతో పూజలు చేశారు. మంత్రపుష్పం, మంగళ నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిర్వహించారు. కాగా వరాహలక్ష్మీనృసింహస్వామిని పలువురు నవవధూవరులు గురువారం దర్శించుకున్నారు. ఈనెల 14న తెల్లవారుజామున సింహాచలం కొండదిగువ, సింహగిరిపై, అలాగే నగరంలోని పలు ప్రాంతాల్లో వివాహాలు జరిగాయి. వివాహాలు చేసుకున్న నవ వధూవరులు, వారి బంధుమిత్రులు వేకువజాము నుండే సింహాద్రినాథుని దర్శనానికి తరలిరావడంతో సింహగిరిపై సందడి నెలకొంది. స్వామివారిని సుమారు వందకుపైగా నూతన జంటలు దర్శించుకున్నాయి.

27న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన

పెదవాల్తేరు, ఫిబ్రవరి 15 : కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈనెల 27 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనున్నట్టు బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్ జీ తెలిపారు. గురువారం అయన నగరంలోని పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్ర ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న క్లస్టర్ సమావేశాల్లో భాగంగా ఉత్తరాంధ్రలోని నాలుగు ఎంపీ స్థానాల్లో సమావేశాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్ :** శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), ఆరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్:** మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2 :** సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- నా సామిరంగ : శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 17, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 18, క్యాబేజ్ 20, క్యారేట్ 24, దొండకాయలు 34, బంగాళా దుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 36, దోస కాయలు 28, వె ల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 34, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఉద్యోగుల ఆందోళన



ఆర్డీవో ఆకార్యాలయం ముందు జేఏసీ సభ్యుల ఆందోళన

భీమునిపట్నం, ఫిబ్రవరి 15 : ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్‌దారుల జేఏసీ పిలుపుమేరకు గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జేఏసీ సభ్యులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోకాలంగా వివిధ రూపాల్లో ప్రభుత్వానికి తమ డిమాండ్లు తెలియజేస్తున్నా పట్టించుకోకపోవడంతో దశలవారీగా ఆందోళన చేపట్టినట్టు తెలిపారు. ప్రధానంగా ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, పెండింగ్‌లో వున్న డీఏలు విడుదల చేయాలని, 11వ పీఆర్‌సీలో పెండింగ్‌లో వున్న బకాయిలు వెంటనే చెల్లించాలని, అదనపు క్వాంటమ్ పెన్షన్ పునరుద్ధరించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో భీమిలి తాలూకా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం. లోవరాజు, సెక్రటరీ కె. సాయిబాబు, ఏపీఆర్‌జేసీ కన్వీనరు ముత్యాలరావు, పింఛనుదారుల సంఘం నాయకులు టి. భీమారావు, ఆనందరావు పాల్గొన్నారు.

మామిడి తోట కౌలుకు బహిరంగ వేలం రేపు

పద్మనాభం, ఫిబ్రవరి 15 : మండలంలోని పొట్నూరు గ్రామంలో కోదండరామస్వామి ఆలయానికి చెందిన మామిడి తోటను కౌలుకు ఇవ్వడానికి శనివారం ఉదయం 11.00 గం.లకు స్థానిక కోదండ రామస్వామి ఆలయం వద్ద దేవదాయ శాఖ ఆధ్వర్యంలో టెండరు కం బహిరంగ వేలం నిర్వహిస్తామని పద్మనాభం గ్రూపు ఆలయాల ఈఓ నానాజీ బాబు చెప్పారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వే నెంబరు 5/1 లో ఉన్న 7.38 ఎకరాల విస్తీర్ణంలోని మామిడి తోట ఫల సాయానికి 2024 మార్చి 1 నుంచి 2024 డిసెంబరు 31 వరకు కౌలుకు ఇవ్వడానికి వేలం నిర్వహిస్తున్నామన్నారు. పాటదారులు రూ.10 వేలు ప్రథమ ధరావతు చెల్లించాలన్నారు. వేలంలో హెచ్చు పాటదారుడు మొదటి సంవత్సరం శిస్తు కూడా చెల్లించాలన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వారికే మద్దతు

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాము



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పద్మనాభం, ఫిబ్రవరి 15 : వచ్చే ఎన్నికల్లో సీపీఎస్ రద్దు చేసే వారికే ఉపాధ్యాయుల మద్దతు ఉంటుం దని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము అన్నారు. మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరావు, సన్యాసిరావు ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఓట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగిగా జీవిత కాలం సేవలందించి పదవీ విరమణ అనంతరం భద్రత కోసం సాధించుకున్న పాత పింఛను విధానం రద్దు చేసి సీపీఎస్, జీపీఎస్ అంటూ చెలగాటం ఆడుతున్నారని, ఈ స్థితిలో ఏ పార్టీ అయితే సీపీఎస్ రద్దు చేస్తా మని స్పష్టమైన హామీ ఇస్తుందో వారికే తమ మద్దతు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు చిన్నారావు, కోశాధికారి ఎంవీపీఎస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు విజయ్, శ్రావణి, రమణమ్మ, కాంచన, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, ఫిబ్రవరి 15 : మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతు దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అయ్యవారి కణమాం, గొల్లల కణమాం, యాత కణమాం, గోరింట, ఎర్రవానిపాలెం, కోలవానిపాలెం, భీమన్నదొరపాలెం, రామవరం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మధురవాడలో...

మధురవాడ/కొమ్మాది : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రేవళ్లపాలెం ఫీడర్ నిర్వహణ దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వల్లీనగర్, చంద్రంపాలెం ఉన్నత పాఠశాల, రేవళ్ళపాలెం, పోలీస్ స్టేషన్, ఉజ్వల హాస్పటల్, భాస్కర్‌నగర్ తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే పీఎంపాలెం ఫీడర్ పరిధిలో విజేత సూపర్‌మార్కెట్, ఏపీహెచ్‌బీ కాలనీ, గాయత్రి నగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అప్పలనాయుడు చెప్పారు.

ఆరిలోవలో...

ఆరిలోవ : విమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా ఉద యం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నారు. ఇంధిరానగర్, రాజీవ్ నగర్, ఆదర్శనగర్, సుందర్ నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదు. అలాగే కైలాసగిరి ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా హనుమంతువాక కొండ, తోటగరువు, బీఎస్ఆర్ నగర్, కైలాసగిరి రోడ్డు, విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

వీర సైనికులకు నివాళి

ఆనందపురం, ఫిబ్రవరి 15 : జమ్మూ, కశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన 40 మంది సైనికులకు వేములవలసలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం నివాళి అర్పించారు. ముందుగా ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం సందీప్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణయ్య, మజ్జి శ్రీను, శ్రీనుబాబు, తమ్మిన అప్పలరాజు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

'విశాఖలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం'

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 15 : విశాఖ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు తాళ్లవలస గ్రామంలో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు కె. ప్రసాదరెడ్డి మాట్లాడుతూ షర్మిల పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్య తలు చేపట్టిన తరువాత నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

జాలరిపేటలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

పెదవాల్తేరు, ఫిబ్రవరి 15 : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం,పార్టీ నాయకులు రాజు, పోలారావు, మొక్కల గోవింద్, పైడిరాజు, ఈశ్వరరావు, మాలిబాబు చిరంజీవి పాల్గొన్నారు.

యువతకు లక్ష్యం ఉండాలి : ఏయూ వీసీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 15 : యువత జీవితం పట్ల సరైన లక్ష్యంతో ముందుకు సాగాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఏయూ కెమిస్ట్రీ విభాగంలో విద్యార్థులకు ఉపయుక్తంగా నిర్వహిస్తున్న ఐదు రోజుల వర్క్‌షాప్ 'ట్రైనింగ్ ఫర్ ఇండస్ట్రీ 2కె24ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని తన జీవితంలో విజయాన్ని రుచిచూడాలని, విజయానుభూతిని ఆస్వాదించాలని సూచించారు. ఈమేరకు ఏయూ అభివృద్ధి చేసిన పలు విభాగాల గురించి వివరించారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఏయూ కెమిస్ట్రీ విభాగంలో నూతనంగా నిర్మించిన ఆర్ఓ ప్లాంట్‌ను వీసీ .ప్రసాదరెడ్డి గురువారం ప్రారంభించారు. ఓఎన్‌జీసీ సహాయంతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ సీజీఎం పీఎస్ రామారావు, ఏయూ రెక్టార్ ఆచార్య కె. సమత, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 15 : కేంద్రం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా శుక్రవారం నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పిలుపు నిచ్చారు. శుక్రవారం ఇసుకతోటలో ఉన్న ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు కావస్తుందని, కానీ కార్మికులకు, కర్షకులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. పోరాటాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఐటీయూసీ సభ్యులు వాలాడా జనార్దన్, గండ్రెడ్డి సతీష్, రామారావు, రమణ సోమనాయుడు, గంగునాయుడు. నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల పట్టాలివ్వాలి : కోరాడ



ఆర్డీవోతో మాట్లాడుతున్న రాజబాబు

భీమునిపట్నం, ఫిబ్రవరి 15 : ఆనందపురం మండలం వేములవలసలో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు కోరారు. గురువారం ఆయన ఆర్డీవో ఎస్. భాస్కర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోరాడ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా గ్రామంలో అర్హులైన 378 మందిని పలు సర్వేల ద్వారా గుర్తించారన్నారు. ఈ జాబితాను పక్కన పెట్టి కొందరు వైసీపీ నాయకులతో తహసీల్దార్ మంతనాలు జరిపి ఎమ్మెల్యే మెప్పుకోసం వారు జాబితాతో 97 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అర్హులైన నిరుపేదలందరికీ న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేములవలస సర్పంచ్ లంకా కొండమ్మ, వార్డు సభ్యులు సారిక విజయకుమార్, వెంకటరావు, టీడీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గుండు చిన్నారావు పాల్గొన్నారు.

12వ వార్డులో ఉచిత వైద్య శిబిరం



రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, ఫిబ్రవరి 15 : పేదలు వార్డుల్లో జరుగుతున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవా లని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. గురువారం 12వ వార్డులో టీబీసీ పాయింట్ వద్ద ఎన్‌టీఆర్ సేవా ట్రస్టు, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన శిబిరంలో గీతం వైద్యులు 950 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసి రావు, బుడుమూరి గోవింద్, రాగతి అచ్యుతరావు. ముగడ రాజారావు, మద్దిల రాజశేఖర్, గాడు అప్పలనాయుడు, పాత్రకండి ధర్మారావు, యల్లమల్లి సురేష్ పాల్గొన్నారు.

18న బీచ్ రోడ్డులో శంఖారావం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 15 : ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులో ఈనెల 18న ఉదయం 9 గంటలకు నారా లోకేశ్ శంఖారావం సమావేశం జరగనున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. ఈ సమావేశానికి హాజరుకావాలని కోరుతూ గురువారం ఆయన జనసేన అర్బన్ అధ్యక్షుడు వంశీకృష్ణకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ కొద్దిరోజుల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. వైసీపీని వీడి జనసేనలోకి వంశీకృష్ణ చేరడం చాలా ఆనందంగా ఉందన్నారు. వంశీకృష్ణ మాట్లాడుతూ యాదవుల సమావేశం పెట్టి యాదవుల ఓట్లు వైసీపీకి పడతాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ భవనాలను కొట్టడం, తనను మానసికంగా హింసించిన వైసీపీకి యాదవులు ఒక్క ఓటు కూడా వేయరన్నారు. అనంతరం వెలగపూడికి ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, పోతన్నరెడ్డి, దువ్విస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పద్మనాభం మాజీ ఎంపీపీ రాజీనామా



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ పద్మ, నగేష్‌కుమార్

పద్మనాభం, ఫిబ్రవరి 15 : వైసీపీలో తమకు, తమ వర్గీయులకు తగిన గుర్తింపు లేకపోవడంతో రాజీనామా చేస్తున్నట్టు మాజీ ఎంపీపీ కె.పద్మ, నగేష్‌కుమార్ చెప్పారు. గురువారం వారు మద్ది గ్రామంలోని వారి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీలో ఉన్న తాము 2020 ఆగస్టులో వైసీపీలో చేరామన్నారు. పార్టీలో చేరినప్పటి నుంచి తమకు సముచిత స్థానం గాని, గౌరవం గానీ లభించలేదన్నారు. ఈవిషయమై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని చెప్పారు. దీంతో తమతో పాటు మాజీ సర్పంచ్ కె. సత్యవతి కూడా పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. రాజీనామా లేఖను ముఖ్యమంత్రికి, జిల్లా పార్టీ కార్యాలయం ద్వారా పంపిస్తున్నామన్నారు. తమ అనుచరులు, సానుభూతిపరులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో వారితో పాటు నాయకులు ఎన్‌వీజీ గిరి, సన్యాసినాయుడు, ప్రకాష్ ఉన్నారు.

2047కి అగ్రగామిగా దక్షిణ భారతదేశం

విశాఖ, విజయవాడ నగరాల్లో ఆర్థిక వృద్ధి

సీఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్ కమల్ బాలి



మాట్లాడుతున్న రీజియన్ ఛైర్మన్ కమల్‌బాలి

ఎండాడ, ఫిబ్రవరి 15 : దక్షిణాది రాష్ట్రాల్లో ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించేందుకు పరిశ్రమల్లో పోటీతత్వంతో పాటు వృద్ధి, సుస్థిరత, నమ్మకం అనే మూడు అంశాల ద్వారా బలోపేతం చేస్తున్నామని సీఐఐ (భారత పరిశ్రమల సమాఖ్య) సదరన్ రీజియన్ ఛైర్మన్ కమల్ బాలి అన్నారు. గురువారం ఆయన బీచ్ రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2047కి దక్షిణ భారతాన్ని మార్చడానికి తొమ్మిది అంశాలపై దృష్టిసారిస్తున్నామని, వాటిలో ప్రజల సంస్కృతి, పునరుజ్జీవనం, శక్తి పరివర్తన, భాగస్వామ్య సహకారం, అంతర్జాతీయ అనుసంధానం, ఈఎస్‌జీ అజెండా, ఇన్నోవేషన్, స్టార్టప్‌లు, ఎకోసిస్టం, ఎంఎస్ఎంఈలు, సాంకేతికను వినియోగించుకోవడం, డిజిటల్ వ్యవస్థలను ప్రోత్సహించడం వం టి అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టు చెప్పారు. వీటి వల్ల ప్రపంచ గమ్యస్థానంగా భారత్ హోదా పెరుగుతుందన్నారు. దేశంలో ఫార్చ్యూన్ 500 కంపెనీలు తమ సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నాయని, భారత్‌లో టూటైర్ సిటీలలో సేవా కేంద్రాలుగా ఉండటానికి ఇది అనుకూలమైన సమయమని వివరించారు. ఏపీలో విశాఖ, విజయవాడ ఆర్థిక వృద్ధికి మంచి నగరాలని చెప్పారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ విభాగం ఛైర్మన్ డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఏపీలో ఆక్వా రంగంలో మంచి అవకాశాలున్నాయని, ఆక్వా సంబంధిత రంగాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిస్తే మరింత ఉత్పత్తి పెంచుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో వారితో పాటు సీఐఐ సదరన్ రీజియన్ రీజనల్ డైరెక్టర్ ఎస్ఎంపీ జయేష్ కూడా ఉన్నారు.



శిక్షణలో పాల్గొన్న జైళ్ల శాఖ ఉన్నతాధికారులు

టెక్నాలజీకి అనుగుణంగా జైళ్లలో మార్పులు

ఆరిలోవ, ఫిబ్రవరి 15 : టెక్నాలజీకి అనుగుణంగా జైళ్లలో పలు మార్పులు చేపట్టనున్నట్టు జైళ్ల శాఖ డైరెక్టర్ ఆఫ్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా, జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. గురువారం వారు కేంద్రా కారాగారంలో రాష్ట్రంలోని జైళ్ల శాఖాధికారులకు నిర్వహించిన పునరుశ్చరణ తరగతుల్లో మాట్లాడారు ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చి మంచి పౌరులుగా తయారు చేసి సమాజానికి అందించాలన్నారు. ఈమేరకు ప్రతి ఒక్క అధికారి అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ లా డాక్టర్ నందిని జైళ్ల నిర్వహణకు సంబంధించి తాజా చట్టాలు గురించి అవగాహన కల్పించారు.

ఆకట్టుకుంటున్న ఖైదీల పెయింటింగ్‌లు



సమావేశ మందిరానికి వెళ్లే గోడలపై వేసిన పెయింటింగ్

ఆరిలోవ. ఫిబ్రవరి 15 : నగరంలోని కేంద్ర కారాగారంలో ఖైదీలు వేసిన పలు పెయింటింగ్‌లు అధికారులను ఆకట్టుకుంటున్నాయి. రెండు రోజులుగా జైలులో రాష్ట్రంలోని ఆ శాఖాధికారులకు పునరుశ్చరణ తరగతులు జరుగుతున్న విషయం తెలిసిందే.ఈమేరకు జైలు లోపల సమావేశ మందిరానికి వెళ్లే మార్గంలో గోడలపై ఖైదీలు వేసిన పెయింటింగ్‌లు అధికారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇందులో చిత్రాలు మనసుకు ఆహ్లాదపరుస్తున్నాయి. ఖైదీల ప్రతిభను పలువురు అధికారులు ప్రశంసించారు.

ఎండాడలో ఆక్రమణలు తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని యాత కాలనీలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మించిన షెడ్‌లను అధికారులు తొలగించారు. 'జాగా కనిపిస్తే వేసే పాగా' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈమేరకు ఆర్ఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బంది కాలనీలోని కొండపై వేసిన షెడ్‌ను నేలమట్టం చేశారు. మిగతా ఆక్రమణలను కూడా త్వరలోనే తొలగిస్తామని తెలిపారు. ఆక్రమణదారులపై కేసులు కూడా నమోదు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ కనెక్షన్లు ఇవ్వరాదని ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు గంగరాజు, మనోజ్, యువరాజ్, గ్రేడ్ -1 వీఆర్వో సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి గ్రామ దేవత పాదాలమ్మకు పూజలు

సింహచలం, ఫిబ్రవరి 15 : అప్పన్న సోదరి, సింహగిరి గ్రామ దేవతల్లో ఒకరైన ఉమామహేశ్వరి పాదాలమ్మకు భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఏడాదికొకసారి అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈమేరకు ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి పూజలు చేసి ప్రత్యేక నివేదనలు సమర్పించారు. మధ్యాహ్నం అక్కడే అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు

సింహచలం, ఫిబ్రవరి 15 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో అగ్ని ప్రమాదాల నివారణకు దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. ఈమేరకు దేవాలయంలో, అన్న ప్రసాద విభాగంలో, పోటులో, ప్రధాన స్టోర్స్, తదితర విభాగాల్లో మొత్తం 50కిపైగా అగ్ని ప్రమాద నివార ణకు సిలెండర్లను అమర్చారు. అయితే వీటిని ఏవిధంగా వినియోగించాలో సిబ్బందిలో చాలామందికి కనీస పరిజ్ఞానం లేదు. దీంతో వారికి దశల వారీగా శిక్షణ ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు.

గీతంలో అంతర్జాతీయ యువజనోత్సవం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 15 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విదేశీ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవం నిర్వహించారు. దీనికి వివిధ విద్యా సంస్థల నుంచి విదేశీ విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు క్రీడా పోటీలతో పాటు సంగీత, నృత్య ప్రదర్శనలు, వివిధ దేశాల వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేసినట్టు గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేపీ కిషన్ తెలిపారు.

మార్కెట్ ఆశీలు వసూలు వేలం వాయిదా

భీమునిపట్నం, ఫిబ్రవరి 15 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో గురువారం ఉదయం మూడో వార్డులో రోడ్డు మార్జిన్లు, లాల్ బహదూర్‌శాస్త్రి, కలిగొట్ల సూర్యనారాయణనాయుడు మార్కెట్లలో రోజువారీ ఆశీలు వసూలుకు బహిరంగ వేలం నిర్వహించారు. మధ్యాహ్నం వరకూ పాటదారులు ఎవరూ హాజరుకాకపోవడంతో అధికారులు వేలాన్ని ఈనెల 21కి వాయిదా వేశారు. ఈమేరకు జోనల్ కమిషనరు శైలజవల్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకూ ఆశీలు వసూలుకు ఈవేలం నిర్వహించారు.

తెలగాలను బీసీల్లో చేర్చాలని పాదయాత్ర

ఆనందపురం, ఫిబ్రవరి 15 : తెలగాలను బీసీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర తెలగ కుల ప్రతినిధి పల్లంట వెంకట రామారావు దొర గురువారం పెద్దిపాలెం, వెల్లంకి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలగ జాతి పాదయాత్రను ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు చేపడుతున్నామన్నారు. తెలగ జాతికి రిజర్వేషన్లు లేక అన్ని రంగాల్లోనూ వెనుకబడిపోతున్నారని, తమను బీసీల్లో చేర్చి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలగ కుల సంఘ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా శర్వాణీ

పెదవాల్తేరు, ఫిబ్రవరి 15 : బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ దుర్వాసుల శర్వాణీ నియామితుల య్యారు. ఈమేరకు పార్టీ నాయకులు గురువారం ఆమెకు నగరంలోని బీజేపీ కార్యాలయంలో నియామక ఉత్త ర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర కోశాధికారి ఎం. నాగేంద్ర, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి కేశవకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు, పాల్గొన్నారు.

'వంశీకృష్ణపై తప్పుడు ఆరోపణలు సరికాదు'

పెదవాల్తేరు, ఫిబ్రవరి 15 : బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న జనసేన నగర అధ్యక్షుడు వంశీ కృష్ణ శ్రీనివాస్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ హెచ్చరించారు. గురువారం ఆయన పెదవాల్తేరులోని సమితి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిరుపేదలకు అండగా, నిత్యం వారి సంక్షేమానికి శ్రమిస్తున్న వ్యక్తి వంశీకృష్ణ అని కొనియాడారు. అటువంటి వ్యక్తిపై ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఎంపీపీ పాఠాలు

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 15 : మండలంలోని దాకమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ఎంపీపీ సూర్యనారాయణ గురువారం పాఠాలు బోధించారు. ఎంపీపీ గతంలో పాఠశాలను సందర్శించినపుడు విద్యార్థులు ఉపాధ్యాయుల కొరత గురించి చెప్పడంతో ఆయన ప్రతి వారం రెండు రోజులు పాఠశాలకు వచ్చి పాఠాలు బోధిస్తానని చెప్పారు. ఈమేరకు పాఠశాలకు వచ్చిన పదో తరగతి విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధించారు. ఆయనతో పాటు ఎంపీటీసీ సభ్యుడు నగేష్ ఉన్నారు.